


ఆదివారం

10 మార్చి, 2024

వార్త


# అరచేతిలో అనంత విశ్వం



# తమన్నాతో స్పెషల్ సాంగ్?

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాట ఉంటుందని, ఆ పాట కోసం స్టార్ హీరోయిన్‌ను తీసుకుంటారని తెలుస్తోంది. తమన్నా చేత ఈ స్పెషల్ సాంగ్ చేయించనున్నట్లు తాజా సమాచారం. ఈ చిత్రంలో బాలయ్య గెటప్ కూడా చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుందని అంటున్నారు. ఇది బాలయ్య టైపు యాక్షన్ డ్రామా కాదు అని, ఇదొక ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్‌తో సాగే ఎమోషనల్ డ్రామా అని ఇప్పటికే వార్తలు వినిపించాయి. ఈ సినిమాలో పాలిటిక్స్ నేపథ్యంలో ఓ ఫ్లాష్ బ్యాక్ ఉంటుందని సమాచారం. ఈ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత నాగవంశీ నిర్మిస్తున్నారు.



# చైతూ, సాయిపల్లవి జంటగా 'తండేల్'

అక్కినేని నాగ చైతన్య ప్రధాన పాత్రలో, డైరెక్టర్ చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'తండేల్'. ఈ చిత్రాన్ని వీలయినంత త్వరలో ప్రేక్షకుల ముందుకి తీసుకు వచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తు న్నారు. నాగ చైతన్య కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌లో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



ఆదివారం వార్త

10 మార్చి, 2024

## మంచి ముత్యాలు

ఎక్కడ పొగడ్తలు ఆగిపోతాయో
అక్కడ గొప్పతనం మొదలవుతుంది.

- యంగ్

## విషయ విశేషం


మంచుకొండల కేకులు... 4

'సంఘీ'భావం....5

గగన్‌యాన్‌కు ఇస్రో సమాయత్తం

కవర్ స్టోరీ..6

అరచేతిలో
అనంత విశ్వం

పట్టుదలతో గెలిచారు..11

పెరుగుతోన్న కరెన్సీ కాలుష్యం...14

ఈవారం కవిత్వం..19

చివరి మజిలీ

కథ.. 20

మంచి ఆలోచన

సాహిత్యం..23

సాహిత్యంలో తెలంగాణ పోరాటం

గురుభక్తి...24

అత్యధిక వేడి ప్రదేశం 'దల్లోల్' ..26

ఎటువైపు కూర్చుంటే మంచిది?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### పార్కుల్లో పుస్తకాలు



మన నగరాల్లోని పార్కుల్లో ఏమేం ఉంటాయి? కలబంద జ్యూస్ నుంచి చిరుధాన్యాల జావదాకా ఆరోగ్యానికి మంచిదనుకున్న ప్రతిదీ ఉంటోంది. కానీ అవన్నీ శారీరక ఆరోగ్యానికి! మరి మానసిక ఆరోగ్యానికి సాహిత్యాన్ని మించింది ఏముంటుంది? అందుకే చెన్నై నగరంలోని ప్రతి పార్కులోనూ ఓ 'బుక్ జోన్'ని ఏర్పాటు చేస్తోంది అకనకడి నగరపాలక సంస్థ. పార్కులకి వచ్చినవాళ్లకి ఉచితంగా పుస్తకాలిచ్చి చదవమంటోంది. చిన్నారుల్నీ, యువతనీ లక్ష్యం చేసుకుని ఇటీవలే వీటిని ఏర్పాటు చేసింది. వార్తాపనరతికలూ, పోటీపరీక్షల పుస్తకాల జోలికెళ్లకుండా పూర్తిగా ఇంగ్లిషు, తమిళ ఆధునిక సాహిత్యాన్నే పరిచయం చేస్తోంది. 'పోటీపరీక్షలకి సంబంధించిన మెటీరియల్ ఎక్కడైనా దొరుకుతుంది. నేటి యువతకి కరవవుతున్నది సాహిత్య పరిచయమే. సంపూర్ణ వికాసానికి అదే తోడ్పడుతుంది' అంటున్నారు ఈ బుక్‌జోన్‌లని ఏర్పాటు చేస్తున్న కార్పొరేషన్ అధికారులు. అది కూడా సంపన్నులున్న ప్రాంతాల్లో కాకుండా మురికివాడల దగ్గరే ఈ పార్క్ బుక్‌జోన్‌లని ఏర్పాటు చేయడం విశేషం.

## జోక్స్..జోక్స్..

స్కూలు ఆటోడ్రైవర్ వ్యథలు

**బాలిక తల్లి:** ఇదిగో టైమ్‌లేదు, నువ్వు జడవేయ్, నేను షూస్ వేస్తా..

**ఆటోడ్రైవర్:** ఏందమ్మ ఇదేం బాధ నాకు, టైమ్‌కు రెడీ చేయాలని తెలియదా?

**మరో విద్యార్థి తండ్రి:** మావాడి షూస్ గట్టిగా కట్టు.

**ఆటోడ్రైవర్:** నీబొంద నీకొడుక్కి నేను టై వేయడం ఏంటిసార్!

**విద్యార్థి తండ్రి:** నువ్వు టైమ్‌కు వెళ్లాలంటే ఇలాంటి పనులు చేయక తప్పవు.

**ఆటోడ్రైవర్:** ఈ పనులకు అదనపు డబ్బులివ్వండి సార్..

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com








# మంచు కొండల కేకులు



ఓ కేకును ఆర్డరివ్వాలనుకున్నప్పుడు అది చాక్లెట్టా, వెనిల్లానా, బ్లాక్‌ఫారెస్టా, స్ట్రాబెర్రీనా, పైనాపిలా అంటూ రుచుల్ని చూసి ఎంచుకోవడంతోనే ఆగిపోవడం లేదు కేకు ప్రేమికులు. సందర్భం, కేకు కోసేవారి ఇష్టాయిష్టాలూ, డిజైనూ, రుచీ ఇలా అన్నింటికీ ప్రాధాన్యం ఇస్తున్నారు. దానికి తగినట్లుగా మాస్టర్ షెఫ్‌లూ, కేక్ నిపుణులూ ఎప్పటికప్పుడు కేకుల్లోనూ ప్రయోగాలు చేస్తూ వాటికి థీమ్‌లను సృష్టిస్తున్నారు. ఆ జాబితాలో ఇప్పటికే ప్రకృతి ప్రేమికుల కోసం పచ్చని చెట్లూ, జలపాతాలూ, దీవులూ, సముద్రం వంటి నమూనాలతో తయారు చేసిన కేకులు వచ్చేశాయి. వాటికి కొనసాగింపుగా తాజాగా ఈ 'స్నో-మౌంటెయిన్' థీమ్‌నూ తీసుకొచ్చారు. మంచుపర్వతాలు అనగానే ఎత్తుగా కనిపించే చల్లని కొండలని ఎవరైనా టక్కున చెప్పేస్తారు. ఆ వింతల్ని, విశేషాల్నీ ఆస్వాదిస్తూనే ప్రకృతి ప్రేమికుల మనసు దోచేందుకు ఈ కేకులను డిజైన్ చేస్తున్నారు. ఈ కేకుల్ని చూసిన వారెవరైనా 'వావ్..ఇది నిజంగా కేకేనా లేక బొమ్మా' అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇంకెందుకు ఆలస్యం మీరూ కొనేయండి..







## 'సంఘీ' భావం



# గగన్‌యాన్‌కు ఇస్రో సమాయత్తం

భారతదేశానికి చెందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రస్తుతం సాహసోపేతమైన ప్రయోగానికి తెరలేపింది. ఇప్పటి వరకు కేవలం మానవ రహిత రాకెట్ ప్రయోగాలపైనే దృష్టి సారించి ఘన విజయాలు సాధించింది. ప్రపంచంలోని అనేక దేశాలు తమ ఉపగ్రహాలను ఇస్రో నుంచి వినువీధిలోకి విజయవంతంగా పంపించాయి. ప్రారంభంలో అనేక సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ క్రమంగా అగ్రదేశాలతో పోటీగా అంతరిక్ష ప్రయోగాలను విజయవంతంగా చేసింది. చంద్రయాన్ వంటి ప్రయోగాలు చేసి ఇస్రో శాస్త్రవేత్తలు తమ సత్తా చాటారు. ప్రస్తుతం మానవరహిత రాకెట్ల ప్రయోగాల నుంచి మానవ సహిత రాకెట్ ప్రయోగానికి ఇస్రో నాంది పలికేందుకు సిద్ధంగా ఉంది. మానవులు అంతరిక్ష యానం చేయడం 1960లోనే ప్రారంభించారు. అయితే ఇప్పటికి వందల మంది కొన్ని గంటల పాటు అంతరిక్షంలో విహరించి క్షేమంగా వెనుదిరిగి భూమిపైకి వచ్చారు. మనదేశం నుంచి పలువురు అంతరిక్షంలోకి వెళ్లినా వారు ఇతర దేశాల వ్యోమనౌకల ద్వారా అంతరిక్షానికి వెళ్లి వచ్చారు. అయితే ఈసారి ఇస్రో ప్రతిష్టాత్మకమైన ప్రయోగానికి సిద్ధపడింది. నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించేందుకు రంగం సిద్ధం చేసింది. గగన్‌యాన్ పేరిట ఇస్రో చేపట్టనున్న ఈ అంతరిక్ష యాత్రలో ప్రశాంత్ బాలకృష్ణ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్, శుభాంశ్ శుక్లాలను తిరువనంతపురంలోని విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా వారిని కలిసి అభినందించారు. ఇస్రో చేస్తున్న ప్రయోగాల పట్ల ప్రధాన మంత్రి మోదీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కేవలం రష్యా, చైనా, అమెరికాలు మాత్రమే అంతరిక్ష యాత్రలను నిర్వహించాయి. చైనా గత సంవత్సరంలోనే ఈ స్థాయి చేరుకుంది. ప్రస్తుతం నలుగురిని అంతరిక్షంలోకి పంపడం ద్వారా మన దేశం కూడా ఈ అగ్రరాజ్యాల సరసన నిలవబోతోంది. ముందుగా సుమారు 60 ఏళ్ల క్రితమే రష్యాకు చెందిన యూరీగగారిన్ అంతరిక్షంలోకి విజయవంతంగా వెళ్లి తిరిగి వచ్చారు. అయితే ఆయన కొన్ని సంవత్సరాల తరువాత జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఆ తరువాత వందల మంది అంతరిక్ష యాత్ర చేశారు. మన దేశం నుంచి ఐదుగురు ఇప్పటి వరకు గగనయాత్రను విజయవంతంగా నిర్వహించారు. 1984లో రాకేశ్‌శర్మ అంతరిక్షంలోకి వెళ్లి తిరిగి వచ్చారు, అయితే అంతరిక్షంలో ప్రయాణం చేసే సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. సాంకేతికపరమైన ఇబ్బందులు ఎదురైనప్పటికీ క్షేమంగా తిరిగి భూమిపై అడుగుపెట్టారు. అంతరిక్షంలో అడుగుపెట్టిన మొదటి భారతీయుడిగా ఆయన రికార్డు స్వంతం చేసుకున్నారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీతో అంతరిక్షం నుంచి జరిపిన టెలిఫోన్ సంభాషణలో భారత్ ఎలా కనిపిస్తోందని అడిగిన ఇందిరాగాంధీ ప్రశ్నకు సారే జహాసే అచ్చా హిందూస్థాన్ హమారా అన్న సమాధానం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆయన ప్రయాణం చేసి వ్యోమనౌక సోవియట్ యూనియన్‌కు చెందినది. ఆ తరువాత కల్పనాచావ్లా, సునీతా విలియమ్స్, రాజాచారిలు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా వ్యోమనౌకలో అంతరిక్షయానం చేశారు. వీరు భారతీయులు కాగా చారి తెలుగువాడు కావడం విశేషం. ఇప్పుడు అంతరిక్ష యాత్రకు నలుగురు వ్యోమగాములు భారతదేశానికి చెందిన ఇస్రో ద్వారా వెళ్లడానికి సిద్ధం కావడం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. 1997లో అంతరిక్షయానం చేసిన కల్పనాచావ్లా మొదటి మహిళగా గుర్తింపు పొందింది. సుమారు 376 గంటల పాటు అంతరిక్షంలో సురక్షితంగా గడిపింది. భూమి చుట్టూ 252 సార్లు పరిభ్రమించి 6.5 మిలియన్ మైళ్లు అంతరిక్ష యానం చేసిన మహిళగా గుర్తింపు పొందింది. ఆమెకు రెండవ సారి అంతరిక్షయానం చేసే అవకాశం లభించింది. 2003 జనవరి 16న ఎస్‌టిఎస్-17 కొలంబియా స్పేస్ షటిల్‌లో 16 రోజులు అంతరిక్షయానం చేయడానికి ఎంపిక అయ్యారు. ఆమెతో పాటు ఏడుగురు వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లారు. హర్యానా రాష్ట్రంలోని కర్నాల్‌కు చెందిన కల్పనాచావ్లా 1962 మార్చి 17న పంజాబీ కుటుంబంలో జన్మించారు. రెండవ సారి అంతరిక్షయానంలో ఫిబ్రవరి 1, 2003లో వ్యోమ నౌక ప్రమాదానికి గురై మృతి చెందారు. అంతరిక్షంలోకి వెళ్లి పరిశోధనలు చేయడంపై ఆసక్తి పెరగడంతో పలు దేశాలు వ్యోమగాములను సిద్ధం చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం మన దేశానికి చెందిన ఇస్రో సాహసోపేత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2016లోనే గగన్‌యాన్ ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. వివిధ దశల్లో ప్రయోగాలు జరుగుతున్నాయి. వ్యోమగాముల ఎంపిక జరిగిన తరువాత వారికి అనేక పరీక్షలు నిర్వహిస్తారు. అంతరిక్షంలో వాతావరణానికి అనుకూలంగా మెలిగేలా వారిని తీర్చిదిద్దుతారు. భూమ్యాకర్షణ శక్తి లేకపోవడంతో శరీరం బరువును పూర్తిగా కోల్పోతారు. ఆహార నియమాల్లో, రోజువారీ కార్యకలాపాల్లో కూడా చాలా మార్పులు ఉంటాయి. వీటిని అనుగుణంగా వీరిని సిద్ధం చేస్తారు. ఈ ప్రయోగం ద్వారా మన దేశం అగ్రదేశాలతో ధీటుగా నిలిచే అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఇస్రో అనేక ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేసింది. ఇటీవలే బాహుబలి పిఎస్ఎల్‌వి ద్వారా భారీ సంఖ్యలో ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. రష్యా, చైనా, అమెరికా వంటి దేశాలకు పోటీగా అంతరిక్ష ప్రయోగాల్లో విజయవంతం సాధిస్తోంది. ప్రస్తుతం మానవసహిత గగన్‌యాన్ విజయవంతానికి సన్నాహాలు ముమ్మరంగా చేస్తోంది.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**



# అరచేతిలో అనంత విశ్వం

కవర్ స్టోరీ

**సుంకవల్లి సత్తిరాజు**

**మానవ మస్తిష్కంలో** మొలకెత్తిన ఆలోచనలు నెమ్మదిగా వేగం పుంజుకుని మానవ మేథస్సుకు పదును పెట్టాయి. జ్ఞాన సాగరాన్ని మధించి, సౌకర్యవంతమైన ప్రపంచాన్ని మానవాళికి కానుకగా అందించాయి. ఆలోచనలు ఆచరణ రూపం ధరిస్తే, ప్రపంచం ఎంతగా మార్పు సంతరించుకుంటుందో ప్రస్తుత ఆధునిక ప్రపంచాన్ని చూస్తే అవగతమవుతుంది. బట్టగట్టడం చేతగాని రోజుల నుండి భూగోళ, ఖగోళ రహస్యాలను ఛేధించే స్థాయికి చేరిన మానవ జీవన సుదీర్ఘ ప్రస్థానంలో చోటు చేసుకున్న అనేక సంఘటనలు ప్రపంచాన్ని నూతనంగా ఆవిష్కరించి, ఆశ్చర్యపరిచాయి. ఎప్పుడో చందమామ, బాలమిత్ర పుస్తకాల్లో చదువుకున్న కథలు, కల్పితాలు వాస్తవ రూపం సంతరించుకున్నాయి. పచ్చి మాంసం తినే రోజుల నుండి పంచభక్ష్య పరమాన్నాలు పరిస్థితులు కల్పించుకున్నాం. నడక పయనం నుండి ఆకాశపథంలో విహరించే పరిజ్ఞానం పెంపొందిచుకున్నాం. రవాణా సౌకర్యాల్లో అనేక మార్పులు సంతరించుకున్నాయి. పాదరక్షలు లేకుండా నడిచే స్థాయి నుండి పాదాలకు మట్టి అంటకుండా పయనించే వినూత్నమైన ప్రయాణ సాధనాలను సమకూర్చుకున్నాం.


మనిషిలోని ఆసక్తికి ప్రతీక 'ప్రశ్న' ప్రశ్నించే తత్వం మన ఆలోచనలు అర్థవంతమైన రూపాన్ని సంతరించుకోవడానికి మార్గం సుగమం చేస్తుంది. మనలోని జ్ఞాన తృష్ణకు పరిపూర్ణత చేకూర్చుతుంది. తనకేమీ తెలియదు అనుకున్నప్పుడే జ్ఞానం వైపు దృష్టి పెట్టవచ్చు. అన్నీ తెలుసునని, విర్రవీగడం అహం ప్రదర్శించడం అజ్ఞానమని గ్రీకుతత్వవేత్త సోక్రటీస్ చెప్పిన మాట సర్వకాల సర్వావస్థలకు అన్వయించవచ్చు. ఈ ప్రపంచం తర్కం మీదనే నడిచింది. తత్వం మీదనే మనుగడ సాగిస్తున్నది. ప్రపంచంలోని ప్రముఖ తత్వవేత్తలు శాస్త్రబద్ధమైన పునాదులతో ప్రపంచ మానవ గమనాన్ని మార్చడానికి కృషి చేసిన మాట సత్యదూరం కాదు.

మన ఆలోచనా పరిధి విస్తరించకపోతే నేడు మనం వీక్షిస్తున్న ప్రపంచం కేవలం కథల్లోనే సాధ్యమయ్యేది. సైన్స్ ఫిక్షన్ పరిధులకే పరిమితమయ్యేది. మన ఆసక్తి, పరిశీలనా పఠిమ క్రియాశీలకంగా పరివర్తన చెందకపోతే ఈ అనంతమైన విశ్వంలో మానవుడు కూడా ఇతర జీవరాశుల్లా కేవలం ఆహారం కోసం మాత్రమే నిరంతరం శ్రమించి, జీవించి, మరణించేవాడు. అలాంటి పరిస్థితులకు భిన్నంగా ఆలోచించి, జీవించడమే మానవ జాతిని నేడు సర్వసృష్టిలో సమున్నత శిఖరాలను అధిరోహించేలా చేసింది. కొండలు, గుట్టలు, అరణ్యాలతో, చిందరవందరగా ఉండే ఒకప్పటి ప్రపంచం నేడు ఇంత అద్భుతమైన సోయగాన్ని సంతరించుకోవడానికి ప్రధాన కారణం ఆలోచనలు, ఆసక్తి రూపం దాల్చడమే. ఈ అనంతమైన విశ్వంలో భూగోళం ఎంతో సౌకర్యవంతమైనది, సువిశాలమైనది. అందులో మానవ ప్రపంచ నిర్మాణం ఎంతో విశిష్టమైనది. కోటాను కోట్ల జీవరాశులు ఈ భూగ్రహంపై నివశిస్తున్నాయి. సముద్రాలు, నదులు, వాగులు, వంకలు, పర్వతాలు, లోయలు, అరణ్యాల వంటి ప్రకృతి సిద్ధమైన ఏర్పాట్ల ఈ భూమిపై కొలువై ఉన్నాయి. ఎన్నో ఆవిష్కరణలు మానవాళిజ జీవితంలోకి ప్రవేశించాయి. అంధకారం నుండి వెలుతురు వైపు మానవ జీవన పయనం కొనసాగింది.. కొనసాగుతున్నది. మానవ జిజ్ఞాస అంతరిక్షాన్ని సైతం శాసించే స్థితికి చేరుకున్నది. భూమి నుండి ఆకాశం వైపు చూస్తూ, గ్రహాల గమనాన్ని తెలుసుకుని కాలమాన పరిస్థితులను ఆకళింపు చేసుకుని, సూర్యచంద్రుల గురించి, గ్రహణాల గురించి, సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల గురించి నాటి శాస్త్రవేత్తలు ఒక ఖచ్చితమైన నిర్ధారణతో పంచాంగాలు రాసేవారు. సామాన్య ప్రజలు కూడా గడియారం సాయం లేకుండా సమయాన్ని చెప్పేవారు. ఆకాశంలో కనిపించే చుక్కలను బట్టి తెల్లవారే

సమయాన్ని ఇట్టే చెప్పేసేవారు. అప్పటి శాస్త్రవేత్తలు కూడా కేవలం తమ తెలివితేటలతో, తమకు తెలిసిన పరిమితమైన జ్ఞానంతో, చిన్నచిన్న పరికరాల సాయంతో ఎన్నో పరిశోధనలు చేసి ప్రపంచంలో అనేక మార్పులకు నాంది పలికారు. నాటి వారి ఆలోచనలు, పరిశోధనలు, వారి జ్ఞానం వలన సాధించిన విజయాలు నేటి ప్రపంచానికి స్ఫూర్తిదా యకంగా మిగిలాయి. నాటి పరిశోధనా ఫలితాలు నేటి శాస్త్రవేత్తల ఆలోచనలకు ఇంధనంగా మారాయి. విజ్ఞాన జిజ్ఞాసతో పడిన ఒక్కో అడుగువందల అడుగులకు మార్గం చూపించింది. నాటి చిన్నచిన్న పరిశోధనలు నేడు పెద్దపెద్ద పరిశోధనలకు మార్గం సుగమం చేసాయి. ప్రపంచాన్ని సమూలంగా మార్చేసాయి. విద్యవైద్య ఆరోగ్యరంగాలు సాంకేతిక వ్యవస్థలు ఆధునాతన రూపం సంతరించుకున్నాయి. మానవుని ఆలోచనలు ప్రయోగాత్మక రూపం సంతరించుకుని, పరిశోధనలకు దారితీసి అనేక ఆవిష్కరణలకు కారణమయ్యాయి. విరామమెరుగని సుదీర్ఘమైన ప్రయత్నాల ఫలితాలను నేడు మనం అనుభవిస్తూ, ఆస్వాదిస్తున్నాం. నూతన ప్రపంచాన్ని ఆవిష్కరించుకుని, ఆనందిస్తున్నాం. శతాబ్దాల మానవ సుదీర్ఘ ప్రస్థానంలో చోటుచేసుకున్న పెను సంచనాలకు మూలకారణం 'సైన్స్'. అలాంటి సైన్స్ ఫలితాలను ఆస్వాదిస్తూ, అందుకు కారణమైన శాస్త్రవేత్తల కృషిని మరవడం భావ్యం కాదు. సైన్స్ ఆవిర్భావానికి కారణమేమిటి? సైన్స్ కోసం, సైన్స్ పరిశోధనల కోసం నాటి శాస్త్రవేత్తలు సాగించిన కృషి, వారు ఎదుర్కొన్న ఇబ్బందులను, సైన్స్ అందించిన ఫలాలను, భవిష్యత్తులో తలెత్తే పరిణామాలను తెలుసుకోవడం మన కనీస ధర్మం. అందుకే సైన్స్ వైపు ఒక్కసారి మన దృక్కోణాన్ని సారిద్దాం.



మనం నివసిస్తున్న భూమి పలు ఖండాలుగా ఏర్పడడానికి కారణం అప్పట్లో సంభవించిన విస్ఫోటనమే. వందల కోట్ల సంవత్సరాల చరిత్ర గల భూమిపై మానవుడు సాగించిన ప్రస్థానంలో సాధించిన ప్రగతి వర్ణనాతీతం. ఏ జీవరాశికి సాధ్యంకాని మహోన్నతమైన కార్యసాధనలో మానవుడే సమస్త సృష్టిలో అత్యంత మేధాశక్తి సంపన్నుడుగా పరిణితి చెందాడు. మనిషి ఆలోచనలు, సృజనాత్మకత ప్రయోగాత్మక ప్రయత్నాల ఫలితమే 'సైన్స్'. సైన్స్ లేనిదే ప్రగతి లేదు. సైన్స్ లేని ప్రపంచాన్ని ఊహించలేం. సైన్స్ అనే భావన వాస్తవం. కల్పితాలకు తావులేని తార్కిక ఆలోచనా దృక్పథమే 'సైన్స్'. సైన్స్ మానవాళికి వరం. నేడు మనం అనుభవిస్తున్న సకల సౌకర్యాలకు మూలం సైన్స్. జననం నుండి మరణం వరకు సాగే మానవ జీవిత పయనంలో సైన్స్ పాత్ర అత్యంత కీలకం. జ్ఞానం, విజ్ఞానం అనే పదాల మధ్య వ్యత్యాసం గమనించాలి. మనకు తెలియని విషయాలను తెలుసుకోవడం జ్ఞానం. ఇందులో సామాజిక, ఆర్థిక, రాజకీయ, వ్యాపార,



ప్రాపంచిక విషయాలు కళాత్మక అంశాలు, చరిత్ర సంబంధిత విషయాలు మిళితమై ఉంటాయి. కాల్పనిక వాదంతో కాకుండా వాస్తవాల ఆధారంగా నిర్మితమైన అధ్యయనం, పరిశీలన, ప్రయోగాల వంటి పలు ప్రక్రియల సమాహారమే విజ్ఞానం లేదా సైన్స్ గా నిర్వచించవచ్చు. విజ్ఞాన శాస్త్రం వర్తమాన మానవ ప్రపంచంలో ఇంతగా ప్రధాన పాత్ర పోషించడానికి ప్రధాన కారణం నమ్మకం కాదు కేవలం 'నిజం'. సైన్స్ అంటే ద్రోహం, దైవధిక్కరణ చర్యగా భావించిన నాటి మూర్ఖత్వభావాల నుండి సైన్స్ ను ఆరాధిస్తూ, శాస్త్రవేత్తలను గౌరవిస్తూ, సైన్స్ ఫలితాలతో సుఖమయం జీవితం ఆస్వాదిస్తున్న ఆధునిక కాలంలో సైన్స్ కు ప్రజలకు అవినాభావ సంబంధం ఏర్పడింది.

విజ్ఞాన వికాసంలో నూతన దేశాల అన్వేషణ కూడా విశేషంగా దోహద పడింది. క్రిస్టోఫర్ కొలంబస్ సముద్రమార్గం గుండా ఇండియాను కనుగొనాలని బయలుదేరాడు. అయితే కొలంబస్ తాను కనుగొన్నది ఉత్తర అమెరికా అని గ్రహించాడు. కొలంబస్ నూతన దేశాల అన్వేషణా క్రమంలో మూఢనమ్మకాల బారినపడి చావు నుంచి తప్పించుకున్నాడు. సూర్యగ్రహణం వలన చీకటి పడుతుందని తెలుసుకోలేని అక్కడి జాతి ప్రజలు కొలంబస్ చెప్పిన గ్రహణ కాల అంధకారాన్ని ఒక మహిమగా భావించి కొలంబస్‌ను వదిలిపెట్టారు. సహజంగా ఏర్పడే ఖగోళ ప్రక్రియలను మూఢనమ్మకాలుగా భావించడం ఈనాటికీ చూస్తున్నాం. సైన్స్ కోసం, సత్యం కోసం కృషి చేసిన అనేకమంది శాస్త్ర, తత్త్వవేత్తలు నాటి పాలకుల, మతాధికారుల మూఢవిశ్వాసాలను దారుణంగా శిక్షించబడ్డారు. నాటి మూఢవిశ్వాసాల నుండి మతాధికారుల దుర్మార్గాల నుండి ప్రజలను కాపాడడానికి ఎంతోమంది శాస్త్రవేత్తలు అహరహం శ్రమించారు. తమ జీవితాలను పణంగా పెట్టి ప్రజల జీవితాల్లో విజ్ఞానకాంతులను విరబూయించారు. సైన్స్ కు మతమౌఢ్యానికి మధ్య జరిగిన సంఘర్షణలో ఎంతోమంది శాస్త్రవేత్తలు ఎన్నో శిక్షలకు గురైనారు. ఎంతో మంది నిర్దాక్షిణ్యంగా హతులైనారు.


నిజం చెబితే దైవద్రోహంగా పరిగణించడం, పరిశోధనలు చేస్తే కఠిన శిక్షలు అమలు చేయడం వంటి అత్యంత దారుణమైన పరిస్థితులున్న నాటికాలంలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలేసి, శాస్త్రీయ ఫలితాలతో రాబోయే తరాల కోసం



శ్రమించి, క్రూరమైన శిక్షలతో బలైపోయిన అలనాటి శాస్త్రవేత్తల చరిత్రను పరిశీలించి, శాస్త్రీయ కోణంలో ఆలోచించడం ద్వారా ఈ ఆధునికంలో విస్తరిస్తున్న అంధ విశ్వాసాలకు, మూఢత్వ భావాలకు, మూర్ఖ సిద్ధాంతాలకు స్వస్తి చెప్పవచ్చు. అరిస్టాటిల్‌ను విజ్ఞానానికే పర్యాయ పదంగా అప్పట్లో పేర్కొనేవారు. అరిస్టాటిల్ గ్రంథాలను విమర్శించడం మత ద్రోహంగా భావించి శిక్షించేవారు. గురుశిష్యులైన గ్రీకు తత్త్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్‌లు విశ్వానికి భూమి కేంద్రమనే యూడోక్సస్ క్నిడస్ ప్రతిపాదనలను బలపరిచారు. భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని, సమస్త గ్రహాలు భూప్రదక్షిణ చేస్తున్నాయని తెలియచెప్పే 'జియో సెంట్రిక్ థియరీ'ని నికోలస్ కోపర్నికస్ తప్పుబట్టాడు. విశ్వానికి సూర్యుడు కేంద్రమని, భూమి నిరంతరం తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ అనుక్షణం పరిభ్రమిస్తున్నదని తన 'హీలియో సెంట్రిక్ థియరీ' ద్వారా కోపర్నికస్ ఆధారాలతో సహా నిరూపించాడు. అంతకు ముందు భూమి చుట్టూ సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు గ్రహరాశులు పరిభ్రమిస్తాయనే జియో సెంట్రిక్ థియరీ అబద్ధమని నిరూపితమైనది. టెలీస్కోప్ కనిపెట్టడం, కోపర్నికస్ సిద్ధాంతానికి మద్దతునిచ్చాడనే అభియోగంతో గెలిలియోకు దైవద్రోహం పేరుతో, యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. వాస్తవాలను వివరించిన గెలిలియో శిక్షాకాలంలోనే మరణించాడు. టెలీస్కోప్‌ను కనిపెట్టి, కోపర్నికస్ సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని బలపరచిన గెలిలియోను ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఆధునిక విజ్ఞాన శాస్త్ర పితామహుడిగా అభివర్ణించాడు. విశ్వం అనంతమైనదని, ఇతర గ్రహాల్లో కూడా జీవం ఉండే అవకాశాలున్నాయని, సూర్యుడు విశ్వానికి కేంద్రమని సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని బలపరచి, ప్రచారం చేసి, ఆధునిక విజ్ఞానానికి పునాదులు వేసిన 'జోర్డాన్ బ్రూనో' మత పెద్దల కోపాగ్నికి



గురయ్యాడు. అతన్ని బంధించి, ఇనుప సంకెళ్లను బిగించి, సజీవ దహనం చేసిన సంఘటన ఈనాటికీ సంచలనమైన విషయంగా భావించబడుతున్నది. మన దేశం ఇటీవల చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 వంటి ప్రయోగాలతో సైన్స్ రంగంలో విశేష ప్రగతి సాధించింది. భూమికంటే పెద్దదైన మరో గ్రహాన్ని అమెరికాకు చెందిన 'నాసా' అంతరిక్ష పరిశోధనా సంస్థ కనుగొన్నట్టుగా వార్తలు వెలువడుతున్నాయి. ఇది నిజమైతే ఇదో అంతరిక్ష అద్భుతంగా, సైన్స్ సాధించిన విజయంగా అభివర్ణించవచ్చు. సాంకేతిక రంగంలో ప్రపంచ వాయు మనో వేగంతో దూసుకుపోతున్నది. వైద్య రంగంలో అనేక మార్పులు సంభవించాయి. అనేక అంటువ్యాధులతో, మహమ్మారులతో ప్రపంచంలోని పలు దేశాల్లో అపారమైన ప్రాణ నష్టం సంభవించిన తరుణంలో వైద్య శాస్త్ర ప్రాధాన్యతను గుర్తించి, అనేక పరిశోధనలు జరిగాయి. అనేక రోగాలకు ఔషధాలు, చికిత్సలు కనిపెట్ట బడ్డాయి. 'స్మాల్ పాక్స్'తో ప్రపంచం అతలాకుతల మవుతున్న దశలో 'ఎడ్వర్డ్ జెన్నర్' వ్యాక్సిన్ కోసం ప్రయోగాలు చేసి 'ఫాదర్ ఆఫ్ వ్యాక్సిన్స్'గా ప్రపంచ ఖ్యాతినార్జించాడు. అప్పటి మశూచి మహమ్మారి నుండి ఇప్పటి కరోనా మహమ్మారి వరకు ప్రపంచాన్ని కాపాడడంలో సైన్స్ ఎంతగానో ఉపకరించింది. కేన్సర్, క్షయ, ఎయిడ్స్ వంటి రోగాలను ప్రాణాంతకమైనవిగా భావిస్తున్న పరిస్థితుల నుండి ఈ వ్యాధులకు గురైన వారిని ప్రథమ దశలో గుర్తించి, చికిత్స చేయడం ద్వారా వారి ఆయుష్షును పెంచడం కూడా సైన్స్ సాధించిన అభివృద్ధిలో ఒక మైలురాయి. చరిత్ర గతిని మార్చిన అనేక మంది శాస్త్రవేత్తలున్నారు. ఈనాటి ప్రపంచం చిమ్మచీకటిని నుండి వెలుతురును చూడగలగడానికి కారణమైన శాస్త్రవేత్తలు చరిత్రలో సువర్ణాధ్యాయాలు లిఖించుకున్నారు. మూఢ నమ్మకాల మత్తు వదిలించడానికి చార్లెస్ డార్విన్ చేసిన కృషి శాస్త్రీయ పరమైన ఆలోచనలకు దోహదపడింది. జీవ పరిణామ క్రమాన్ని వివ రించి, ప్రపంచానికి నిజాని జాలు చాటి చెప్పిన శాస్త్రవేత్త డార్విన్. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జర్మనీకి చెందిన సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త. అత్యంత పేదరికం వెంటాడినా, అతని పరిశోధనకు పేదరికం అడ్డురా లేదు. అతని పరిశోధనా ఫలి తాలు ప్రపంచ



భౌతిక శాస్త్ర గతిని మార్చాయి. ఐన్‌స్టీన్ మేధస్సు వర్ణింపనలవి కాదు. అందుకే అతను చనిపోయినప్పటికీ అతని మెదడును భద్రపరిచి, పరిశోధనలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు మన ఆలోచనలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడమే 'సైన్స్' అన్న ఐన్‌స్టీన్ భావన ఆచరణీయం పరిశీలనా శక్తి ప్రపంచాన్ని ఎలా మార్చగలదో ఐజాక్ న్యూటన్ వివరించాడు.

సైన్స్‌ను టెక్నాలజీని విభజించి చూడలేం. సైన్స్ అనే మహా వృక్షానికి చెందిన ఫలమే టెక్నాలజీ. నేడు ప్రపంచం ఇంతగా అభివృద్ధి చెందడానికి పెరిగిన సాంకేతిక పరిజ్ఞానమే కారణం. అనేక రంగాలు సాంకేతిక పరిజ్ఞానంతో పెనవేసుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు వ్యవస్థలన్నీ టెక్నాలజీ సాయంతో నడుస్తున్నాయి. డిజిటల్ టెక్నాలజీ అనేక అద్భుతమైన ఫలితాలకు ఆలవాలంగా మారింది. విద్య, వైద్య, ఇంజినీరింగ్, కళా, సాంస్కృతిక రంగాలు టెక్నలజీ వలన వినూత్నమైన రూపం సంతరించుకున్నాయి. అనేక వ్యాధులకు



చికిత్స నందించడంలోను, శస్త్ర చికిత్సల్లోను సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతున్నది. విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు అందుబాటులోకి రావడంతో నేర్చుకునే ప్రక్రియ సులభతరంగా మారింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో సరికొత్త మార్పులొచ్చాయి. నేర పరిశోధనలో టెక్నాలజీ పాత్ర కీలకంగా మారింది. సమాచార వ్యవస్థ స్వరూప స్వభావాలు మారిపోయాయి. ఇంటర్నెట్‌లో సకల సమాచారం లభ్యమవుతున్నది ఓపెన్ ఎఐ సృష్టించిన చాట్ జిపిటి అత్యంత వేగంగా విస్తరించే అవకాశముంది. ఇప్పటికే చాట్ జిపిటి ప్రకంపనలు గూగుల్‌ను భయపెడుతున్నాయి. చాట్ జిపిటి వలన గూగుల్ సెర్చ్ ఇంజన్ అదృశ్యమయ్యే అవకాశముంది.

"సైన్స్ అండ్ టెక్నాలజీ" మానవ జీవితాలను శాసిస్తున్నది. పైన ఉదహరించిన ప్రయోజనాలతో పాటు అనేక విపరీత పరిణామాలకు కూడా విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేయడం బాధాకరం. ఇది కేవలం మానవ తప్పిదం. సైన్స్‌ను, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడలో మంచి చెడుల విచక్షణ అవసరం. అప్పటికే సాంఘిక మాధ్యమాలు హోరెత్తిపోతున్నాయి. విద్యార్థులు, యువతతో పాటు విద్యాధికులు, పెద్దలు సైతం సోషల్ మీడియా కబంధ హస్తాల్లో చిక్కుకుని, వాటికి దాసోహమై మానవ సంబంధాలకు తిలోదకాలిస్తున్నారు. వేగవంతమైన ఇంటర్నెట్ వలన అనేక యూట్యూబ్ ఛానళ్ల ప్రభావమే అధికంగా కనిపిస్తున్నది. అసభ్యకరమైన కంటెంట్ యువత జీవితాలను నాశనం చేస్తున్నది. అనేక పోర్న్ సైట్లు అందుబాట్లోకి వచ్చాయి. ధనార్జనే ధ్యేయంగా భావించి విలువలకు తిలోదకాలిస్తూ, నగ్న సంస్కృతిని ప్రోత్సహిస్తూ, బ్లాక్ మెయిలింగ్ పద్ధతులకు పాల్పడడం వలన సమాజంలో ఆటవిక ప్రవర్తన పెరిగిపోయే అవకాశాలు ఏర్పడ్డాయి. మహిళలను, బాలికలను బెదిరిస్తూ, బాధిస్తూ, మానసిక, లైంగిక హింసలకు గురి చేస్తున్న వారిని శిక్షించడం కష్టసాధ్యంగా మారింది. అంతర్జాతీయ స్థాయిలో సాగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయకపోతే మోసాలే మానవ నైజంగా మారి, హింసా ప్రవృత్తి పెరిగేపోయే అవకాశముంది. ఆన్‌లైన్ గేమింగ్ ప్రక్రియలు వ్యసనంగా మారిపోతున్నాయి. కల్పితాలతో కూడిన కంటెంట్‌తో మానవ జీవితాలు అల్లకల్లోలమయ్యే పరిస్థితులకు సైన్స్ అండ్ టెక్నాలజీ కారణం కాదు.

ఎన్ని విజయాలు సాధించినా, ప్రపంచం వైజ్ఞానికంగా ఎంతగా ముందుకు దూసుకుపోతున్నా, శాస్త్రవేత్తల పరిశోధనలు ఆగలేదు. అనేక విషయాలపై నేటికీ విస్తృతంగా పరిశోధనలు, ప్రయోగాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో మనిషి మృత్యువును కూడా జయించగలడేమో అనే నమ్మకం కలుగుతున్నది. ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు ఈ నిజానికి బలం చేకూర్చుతున్నాయి. మనిషి ఆయుష్షును పెంచడానికి పరిశోధనలు జరుగుతున్నాయి. 'ఏజ్ రివర్సింగ్ ప్రాసెస్' ఎలాంటి సత్ఫలితాలనిస్తుందో వేచి చూడాలి. మానవ కణలను, శరీర అవయవాలను మార్చి, ఎలాంటి రోగాలు లేకుండా మనిషి వందలాది సంవత్సరాలు జీవించడం కోసం పరిశోధనలు జరుగుతున్నాయి. మనిషి మెదడులో మైక్రో చిప్ అమర్చడానికి జరుగుతున్న ట్రయల్స్ గురించి, చిప్ ట్రాన్స్ ప్లాంటేషన్ ప్రక్రియ గురించి వింటుంటే మానవ జీవితాలు భవిష్యత్తులో లాంటి మార్పులు సంతరించుకుంటాయో ఊహించుకోవడానికే భయం కలుగుతుంది. మానవ మేధస్సుకు కృత్రిమ మేధస్సు

తోడు కావడం భవిష్య పరిణామాలపై ఆసక్తితో పాటు, భయోత్పాతం కలగడం సహజం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సంభవిస్తున్న పరిణామాలు కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారకూడదు. శాస్త్ర పరిశోధనలకు ఉపక్రమించే ముందు వాటి వలన ఏర్పడే విపత్కర పరిణామాల గురించి ముందే ఆలోచించాలి. ఇప్పటికే పెరిగిన శాస్త్ర, సాంకేతిక ఎరిజ్ఞానం వలన మానవ జీవితం అనేక మలుపులు తిరిగింది. కొన్ని ఊహించని పరిణామాలు కూడా సంభవించాయి.

అయితే మనకంటే భౌతికంగా బలమైన కొన్ని జంతువులు, బలహీనమైన పక్షిజాతులు, క్రిమి కీటకాలు, జలచరాలు, కంటికి కనిపించని సూక్ష్మజీవులు ఇప్పటికే అంతర్ధానమైపోయాయి. మనుషుల మాదిరిగా కాలాలకతీతంగా నిలబడగలిగే శక్తి సామర్థ్యాలు ఇతర జీవుల్లో లేకపోవడమే వాటి మనుగడకు ప్రశ్నార్థకంగా మారింది. మానవ ఆలోచనలు, మేధస్సు కారణంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం విస్తరించింది. 'సైన్స్ అండ్ టెక్నాలజీ' ప్రభావంతో నేడు మనమంతా ఎంతో సౌకర్యవంతంగా జీవిస్తున్నాం. ఇలాంటి అనుకూల పరిస్థితులను కాదనుకుని, జంతువుల్లా జీవించాలనుకోవడం జంతు ప్రవృత్తిని అలవరచుకుని, మానవ నాగరికతకు, మానవ జీవన విధానంలోని విశిష్టతకు దూరంగా జరగాలనుకోవడం, కేవలం ఏదోలా జీవించడానికే మార్గాలను అన్వేషించడం దేనికి సంకేతం? కేవలం బతకడానికే ప్రాధాన్యతనిచ్చే విపరీతమైన ధోరణులను అలవరచుకోవడం మానవ అస్థిత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. వైజ్ఞానిక సాంకేతిక ప్రగతిని స్వార్థం కోసం వినియోగించడం, నేరపూరిత ప్రవర్తనతో ఇతరులను వంచించి, హింసించి చంపడం, కేవలం తినడానికే బతకడం, బతకడానికి మోసాలు చేయడం జంతు ప్రవృత్తికి నిదర్శనం. ఇకనైనా ఈ ధోరణి మారాలి. పెరిగిన విజ్ఞానం మెరుగైన జీవితాలకు సోపానం కావాలి. 'సైన్స్ అండ్ టెక్నాలజీ' వినియోగం మనతో పాటు మనతో మమేకమై జీవిస్తున్న ఇతర జీవరాశుల మనుగడకు ప్రమాదకరంగా పరిణమించకూడదు. ప్రస్తుత వైజ్ఞానిక ఆవిష్కరణలు మనిషిని మృత్యుంజయుడిగా మారుస్తాయో, మృత్యువుకు ఎరగా వేస్తాయో కాలమే సమాధానం చెప్పాలి. కొంతమంది మేధావులు, శాస్త్రవేత్తలు భూగోళంపై సంభవిస్తున్న వేగవంతమైన మార్పుల వలన సమీప భవిష్యత్తులో మానవాళి ప్రమాదంలోకి నెట్టబడుతుందని, ఫలితంగా భూమి నిర్జీవమయ్యే అవకాశం



లేకపోలేదని హెచ్చరికలు చేయడం ఆందోళన కలిగించే అంశం. ఇప్పటికే జరుగుతున్న పరిణామాల ఫలితాలను చవిచూస్తున్నాం. జరగబోయే విపత్కర పరిణామాల గురించి కూడా ఆలోచించి, అవసరమైనంత మేరకే విజ్ఞాన, సాంకేతిక శాస్త్ర ఫలితాలను వినియోగించాలి.

మన పరిశోధనా ఫలితాలు శాస్త్రసాంకేతిక రంగాల అభివృద్ధి ఆరోగ్యవంతమైన ప్రపంచాన్ని సృష్టించాలి. సమిష్టి జీవనం నశించిపోయిన నేపథ్యంలో గతం గుర్తుకు వచ్చి బాధిస్తున్నది. ఏవీ గతం గుర్తులు? ఎక్కడున్నాయి నాడు ఆప్యాయత, ఆత్మీయతలు? ఎక్కడ దాగున్నాయి వర్తమానం మరచిన పూర్వ వైభవ కీర్తికిరీటాలు? కాలం విడిచిన శిథిల జ్ఞాపకసౌధాల్లోనా? చదవని చరిత్ర పుస్తకాల అక్షరాల్లోనా? నాడు విరిసిన జనజీవన సౌందర్య మాధుర్యం ఏడ దాగున్నది? చెరువులో నీరులేక చెరువుగట్టు బెంగపెట్టుకుంది. చెరువు గట్టుపై కబుర్ల సెలవడిగాయి. పల్లె ఆప్యాయతలను నగరాలు మింగేసాయి. పచ్చని చెట్లన్నీ నేలకొరిగాయి. గూడులేక పక్షులన్నీ విలపిస్తున్నాయి.

విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో వచ్చిన పెను మార్పులు వరమా? శాపమా? మనం నిర్మించుకున్న నూతన సాంకేతిక ప్రపంచం మన జీవితాలనే శాసించడం అవాంఛనీయం. సాంఘిక మాధ్యమాల వలలో చిక్కుకున్న మానవ జీవనం కాంక్రీటు కట్టడాల్లో బందీగా మారుతుంటే ఏదో తెలియని ఆవేదన మనసును వేధిస్తున్నది. గత కాలం గొప్పదనం గుర్తుకొస్తున్నది. వర్తమానం తలచుకుని మనసంతా కలత చెందుతున్నది. నడుస్తున్న కాలంలో జరుగుతున్న సంఘటనలు చూసి, శాస్త్ర, సాంకేతిక రంగాల తీరును గమనించి, రేపటి దృశ్యం నేడే కనుల ముందు సాక్షాత్కరించి, భయపెడుతుంటే కదిలే కాలాన్ని ఆపాలనిపిస్తుంది. కనికరం లేని కాలవాహినిలో ఆలోచనలన్నీ కొట్టుకుపోయి, ఉప్పు సంద్రంలో కలిసి, ఉవ్వెత్తున లేచే కెరటాలై ముందు కొచ్చి, వెనక్కి పోయి, సాగర గర్భంలో కలిసిపోతుంటే, గతం నిదురించింది, వర్తమానం వికటించింది. ఆధునిక ప్రపంచంలో ఒంటరితనం చరవాణి సాయం కోరింది. మానవ సంబంధాలు సాంకేతిక వలయంలో చిక్కి శల్యమైపోతున్నాయి. ఈ నేపథ్యంలో మున్ముందు జరగబోయే విజ్ఞాన, సాంకేతిక పరిశోధనలు, వాటి ఫలితాలు మానవ సహజ జీవన శైలికి, మానవ సహజ స్వభావానికి విఘాతం కలగకుండా కాపాడాలని కోరుకుందాం. ❑



# పట్టుదలతో గెలిచారు



**జస్మిత్ థింద్** ముంబయి కుర్రాడు. 2013లో హిందుస్తాన్ యూనిలీవర్‌లో సబ్బుల విభాగంలో మూడేళ్ల ఉద్యోగం అతడిని వ్యక్తుల్ని నిశితంగా పరిశీలించే అలవాటు చేసింది. ఫ్యాషన్ మీద ఇష్టంతో ఎడాపెడా బ్రాండెడ్ దుస్తుల్ని కొని

## కొత్త ఆలోచన

మోజు తీరాక పారే యలేకా, మళ్లీమళ్లీ వేసుకోలేకా స్నేహితులు పడుతున్న అవస్థని గమనించాడు. ఖరీదైన ఆ దుస్తుల్నీ యాక్సెసరీల్నీ కాస్త తక్కువ ధరకి మళ్లీ అమ్మేస్తే ఇటు అమ్మేవాళ్లకీ, అటు బ్రాండెడ్ వస్తువుల్ని ఎక్కువ ఖరీదు పెట్టి కొనుక్కోలేనివాళ్లకీ కూడా లాభమే కదా అనుకున్నాడు. స్నేహితురాలు మహిమతో కలిసి 2016లో ఫ్యాషన్ రీ కామర్స్ మార్కెట్‌ప్లేస్‌గా 'కౌట్‌లూట్'ని ప్రారంభించాడు. కొనుగోలుదారులకీ అమ్మకందారులకీ కలిసి ఒకే వేదికలా పనిచేసే దీన్ని ఆప్‌లాగా తేవడమేకాక గృహాలంకరణ చేర్చడంతో సంస్థ విజయపథాన సాగుతోంది.

**అసోం** రాష్ట్రంలో మారుమూల పల్లె శివబ్రత మాతృభాష అస్సామీ అయితే స్కూల్లోనేమో బెంగాలీ మాధ్యమం ఉండేది. ఎలాగో కష్టపడి పదో తరగతి గట్టెక్కితే ఆ తర్వాత ఇంగ్లిషు భదూతంలా భయపెట్టిం ది. అది చాలదన్నట్లు ఒకసారి ఏకంగా 730 రోజుల పాటు వాళ్ల ఊరికి కరెంటూ నీళ్లూ లేవు. ఆ కష్టాలే అతడిలో కసినీ పెంచాయి.

## సాధించాడు

కష్టపడి చదివి ఐఐటీ ముంబయిలో సీటు సంపాదించాడు. డిగ్రీ చదివేటప్పుడే రకరకాల వ్యాపారాలు చేసి చేతులు కాల్చుకున్నాడు. అయినా పట్టా పుచ్చుకోగానే 2013లో స్నేహితుడు మనోజ్ మీనాతో కలిసి 'ఆటంబర్గ్' అనే టెక్నాలజీ కన్సల్డింగ్ సంస్థ పెట్టాడు. దాంతో ఊరూ, అక్కడి కష్టాలూ గుర్తొచ్చాయి. ఎలాగ్గైనా తెలిచితీరాలను కుని పల్లెలకు పనికొచ్చేలా తక్కువ కరెంటుతో పనిచేసే స్మార్ట్ ఫ్యాన్ల తయారీ చేపట్టాడు. జీతాలు ఇవ్వలేక కంపెనీ మూసేసే పరిస్థితి వచ్చినా శివబ్రత ధైర్యం కోల్పోలేదు. పట్టుదలగా ప్రయత్నించి నెలరోజుల్లో వెయ్యికోట్ల రూపాయల పెట్టుబడులు సాధించాడు.



**శైలేష్ కుమార్‌ది** బిహార్‌లోని సమస్తిపూర్ అనే చిన్న టౌన్. శిక్షణ పొంది పరీక్ష రాసినా ఐఐటీలో సీటు రాలేదు. దాంతో తండ్రి బలవంతం మీద పంజాబ్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. ఢిల్లీ వెళ్లి 32 వేలకు ఒక ఉద్యోగంలో చేరితే తనని ఆఫీసుకు తీసుకెళ్లే క్యాబ్ డ్రైవర్‌కి 60వేలు వస్తుందని తెలిసి సిగ్గుపడ్డాడు. తనే కారు కొని క్యాబ్‌లా నడపడం



## డెలివరీ బాయ్‌గా చేరి..

మొదలెట్టాడు. ఇంతలో దాన్ని ఎవరో దొంగలించారు. జీతమంతా దాని ఈఎంఐ కట్టడానికి సరిపోయేది. అప్పుడు మళ్లీ లోన్లు తీసుకుని మరికొన్ని కార్లు కొని క్యాబ్ బిజినెస్ నడిపాడు. నష్టం రావడంతో దాన్ని మూసేసి ఈ-కామర్స్ బిజినెస్ పెట్టాడు. అందులోనూ నష్టమే వచ్చింది. ఉద్యోగ వ్యాపారాల్లో నిలదొక్కుకోలేకపోవడం, మరోపక్క భార్యాబిడ్డలూ పెరుగుతున్న బాధ్యతలూ అన్నీ కలిసి అతడిని తప్పనిసరి పరిస్థితుల్లో ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా చేరేలా చేశాయి. కానీ అతనిలోని వ్యాపారవేత్త మాత్రం పరిస్థితులతో రాజీపడలేకపోయాడు. ఏడాది తిరిగేసరికి క్రియేటివిటీ ఎట్ బెస్ట్ టెక్నాలజీస్ (సీఏబీటీ) పేరుతో లాజిస్టిక్స్ కంపెనీ పెట్టాడు. 2018లో ప్రారంభమైన ఈ కంపెనీ విలువ ఇప్పుడు రూ.150 కోట్లు. రెండువేలమంది ఉద్యోగులతో 23 రాష్ట్రాల్లో సేవలందిస్తున్న బయటి నుంచిరూపాయి పెట్టుబడి తీసుకోలేదు. .

# వృద్ధుల ఐకమత్యం



**ఉదయం** లేచి ఇతర పనులతో పాటుగా వంట చేసుకోవడమనేది నిజంగానే పెద్ద పనే. పైగా వృద్ధులకూ అనారోగ్యసమస్యలతో ఇబ్బందిపడుతున్న వారికైతే మరింత కష్టం. కావాల్సిన సామాన్లు తెచ్చుకుంటూ రోజూ భోజనం వండుకోవడమంటే కాస్త భారంగానే ఉంటుంది మరి. అలాగని రోజూ బయటి నుంచి తెచ్చుకుని తినలేరు. తినకుండా పస్తు ఉండలేరుగా, అలాంటప్పుడే ఏం చేస్తే బాగుంటుందన్న ఆలోచనతో ముందుకొచ్చిందో ఊరు. అదే గుజరాత్‌లోని చందన్కి అనే పల్లే. వెయ్యికిపైగానే జనాభాతో ఉండే ఈ ఊళ్లోని యువత చదువు, ఉద్యోగం అంటూ విదేశాలకూ ఇతర పట్టణాలకూ వలస వెళ్లిపోయింది. దాదాపు 300 మంది పెద్దవాళ్లే ప్రస్తుతం చందన్కిలో ఉండిపోయారు. వారంతా వంటావార్పూ చేసుకోవడానికి ఇబ్బంది పడటం గమనించిన రతిలాల్ సోమనాథ్ పటేల్ అనే ఈ ఊరి వ్యక్తి పదేళ్ల క్రితం కమ్యూనిటీ కిచెన్‌ని ఏర్పాటు చేశాడు. అందరూ తలా కొంత డబ్బు జమ చేస్తూ ఒకే దగ్గర వండుకోవడం మొదలుపెట్టారు. ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా మూడు పూటలూ ఊరందరూ కలిసి ఒకేచోట భోజనం చేస్తున్నారు. ఒక ఇంట్లో నలుగురికి వంట చేయడానికే ఎంతో పని ఉంటుంది. మరైతే 300 మందికి సరిపడా వండాలంటే సరకులు తేవడం దగ్గర్నుంచి వండి వడ్డించే వరకూ ఎన్నో పనులుంటాయిగా. కచ్చితంగా ఎవరో ఒకరు బాధ్యత తీసుకుంటేనే కదా అవన్నీ సక్రమంగా జరుగుతాయి. అందుకే మరి, ఊరంతా కలిసి ఆ పనిని సర్పంచ్‌కి అప్పగించారు. వంట చేయడానికి పెద్ద కిచెన్, అందరూ కలిసి తినేలా హాల్..లాంటి సదుపాయాలన్నీ సమకూర్చుకున్నారు. వండటానికి ప్రత్యేకంగా వంటవాళ్లనీ ఇతర పనివాళ్లనీ పెట్టుకుని రోజూ అన్నం, పప్పు, చపాతీ, కూర, స్వీట్‌తో మెనూనూ ఏర్పాటు చేసుకున్నారు. డైనింగ్ హాల్ వరకూ రాలేనివాళ్లకు ఇంటికే పట్టుకెళ్లిచ్చే సౌకర్యమూ ఉంటుందట. ఇంకా ఇంట్లోవాళ్లను చూడ్డానికి వేరే ఊళ్ల నుంచి వచ్చే ఇతర కుటుంబసభ్యులూ ఇక్కడే తింటారట. కేవలం మనిషికి ఇంత అని లెక్కగట్టి నెలకోసారి డబ్బులు సమకూర్చుకుంటారు. ఒక్క వంటగది విషయంలోనే కాదు..ఊరంతటినీ శుభ్రం చేసుకోవడంలో, సోలార్ పవర్‌లాంటివి ఏర్పాటు చేసుకోవడం లోనూ అందరూ ఒకేమాట మీద ఉండి నిర్ణయం తీసుకుంటారట. ఒక్కమాటలో చెప్పాలంటే మనుషులందరూ వేరువేరు ఇళ్లలో ఉన్నా.. వసుదైక కుటుంబంలా కలిసిమెలిసి ఉంటారన్నమాట. ఏది ఏమైనా, ఇలా ఉండటం వల్ల ఇటు వంట చేసుకోలేని పెద్దవాళ్లకూ ఇబ్బంది లేకుండా ఉంటుంది. వేరే చోట ఉన్న కుటుంబ సభ్యులకూ ఇంట్లోవాళ్లకు భోజనమెలా అన్న బెంగ ఉండదు. కలసి కట్టుగా తోడుగా ఉండే ఈ ఊరు కచ్చితంగా ఆదర్శప్రాయమే అని చెప్పాలి.



## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూని స్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూ న్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంప గోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త,
నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్
మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

# పుస్తక సమీక్ష

## తెలుగు కన్నుతో అవతలి ప్రపంచ పరిచయం

'ఏ దేశమేగినా ఎందుకాలిడినా..నిలపరా నీ జాతి నిండు గౌరవము' అన్న రాయప్రోలు వారి జన్మభూమి గీతాన్ని ప్రేరణగా తీసుకున్నారు వంగూరి చిట్టెన్‌రాజు. తెలుగు సాహిత్యానికి అమెరికాలో పెద్దపీట వేసి గతమూడు దశాబ్దాలుగా 'వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా' సంస్థ ద్వారా సాహిత్య ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా అమెరికా తెలుగు రచయితల కథానికా సంకలనాల్ని వెలువరిస్తున్నారు. ఇది వారి 17వ సంకలనం. రాజుగారి సంస్థ మొత్తంగా 117 పుస్తకాలను ఇంతవరకు ప్రచురించింది. ఇవన్నీ సాహితీ మణిహారాలై తెలుగుతల్లి గళసీమన భాసిస్తున్నాయి. నిబంధనలు నాకుతెలవ్వకాని 'పద్మశ్రీ'కి అర్హులు అనిపిస్తుంది. వంగూరి చిట్టెన్‌రాజు మరి ఇద్దరి సంపాదకత్వాన వెలుబడిన ఈ కథానికా సంకలనంలో 31 కథానికలున్నాయి. అమెరికాలో స్థిరపడినా మాతృభాషమీది మమకారంతో రాసిన 'కథలు' ఇవి. వంటింట్లో ఆవాలు జీలకర్ర పోపు వేసినా మ్రోగే ఫైర్ అలారంతో వచ్చే తిప్పలు (ఆనవాయితీ, కథానిక) ఎలా పరిష్కరించాలో తెలిపిన వైనం. చిన్నపుడు ఇండియా పల్లెటూర్లో జరిగే పెళ్లి, మండపం అమెరికాలో కొడుక్కు చేయాలని ఆశపడి నిరాశ చెందిన వైనం (మండపం) వెంట్రుకల చిక్కు అయినా, గాలికెగిరి పక్కవాళ్ల పెరట్లో పడితే జరిగే కలకలం (మభ్యపెట్టి మాయచేయాలి).రెండు దేశాల మధ్య వారధిగా నిలుస్తోన్న ఈ కధాకమామిషులు మనకు అందించి ఆనందపరుస్తోన్న వంగూరి వారికి వందనాలు.వారి ప్రయత్నాల్ని ఆదరిద్దాం. అక్కున చేర్చుకుందాం.





**(డయాస్పోరా, సంపాదకులు: వంగూరి చిట్టెన్ రాజు, సాయి రాచకొండ, దీప్తి పెండ్యాల, వెల :రూ 200, ప్రతులకు: అచ్చంగా తెలుగు, ఇతర ప్రముఖ బుక్‌హౌస్)**

**– కూర చిదంబరం**

## 'సహజ నటనాభినేత్రి సావిత్రి'

1972లో స్థాపించిన 'వంశీ ఇంటర్నేషనల్ సంస్థ తన '16'వ పుస్తకంగా మహానటి సావిత్రి నటించిన ముఖ్యమైన 80 చిత్రాల గురించి 80మంది రచయితలు రచయిత్రిలతో రాయించిన విశ్లేషణా వ్యాససంపుటి ఇది. స్వర్ణోత్సవకానుక. వంశీరామరాజు, విజయచాముండేశ్వరి, జమున, మండలి బుద్ధప్రసాద్, సురభి వాణీరావు, భువనచంద్ర, వోలేటి పార్వతీశం, రేలంగి నరసింహారావు, ఇంద్రగంటి జానకీబాల, శారద ఆకునూరి (అమెరికా), సురేఖామూర్తి దివాకర్ల (భారతదేశం)లాంటి వారల తొలిగా పరిచయపూర్వక ముందుమాటలు పుస్తక ఉద్దేశాన్ని సావిత్రి నటనావైదుష్యాన్ని తెల్పుతాయి. ఇవి అంతర్జాలంలో ప్రసంగాలైన వ్యాస విశ్లేషణలే. దాదాపు 5 ఖండాల్లోని 9 దేశాల రచయితలు/రచయిత్రుల ప్రసంగాల సంకలనం ఇది.



సావిత్రి అనగానే మనకు బాగా వెంటనే గుర్తుకు వచ్చే చిత్రాలు మూగ మనసులు, మిసమ్మ, పాండవవన వాసం, నర్తనాల, గుండమ్మకథ, రక్త సంబంధం గుర్తుకొస్తాయి. 1951లోని 'రూపవతి' చిత్రంపై ఇందిరా ప్రియదర్శిని, 1952 నాటి పల్లెటూరు (ఎన్టీఆర్‌తో) గురించి ప్రత్తిపాటి సుభాషిణి, మిసమ్మ, చిత్రంపై కొండపల్లి నీహారిణి, అర్ధాంగి (ఎఎన్ఆర్‌తో) చిత్రంపై రాధిక మంగిపూడి, తోడికోడళ్ల చిత్రంపై అత్తలూరి విజయలక్ష్మి మొదలైన వారి వ్యాసాలున్నాయి.1951 సంవత్సరం నుండి 1981 సం॥దాకా సావిత్రి నటించిన చిత్రాల జాబితా, అలనాటి సినిమా పోస్టర్స్, సినీ దృశ్యాల ఫొటోలు అందించారు. జాతీయ అంతర్జాతీయస్థాయిలో చేస్తూ 50కిపైగా విలువైన సాహిత్య గ్రంథాలు ముద్రించడం ఎంతైనా అభినందనీయం.

**(సహజ నటనాభినేత్రి సావిత్రి, సంకలనకర్తలు: డా॥తెన్నేటి సుధాదేవి, జ్యోతివలబోజు, వెల: రూ 400, ప్రతులకు: వంశీ ఆర్ట్ థియేటర్స్, 2-1-527/5, నల్లకుంట, హైదరాబాద్)**

**– తంగిరాల చక్రవర్తి**

## 'మిసెస్ అండర్ స్టాండింగ్' 'బ్నిం'

గీతల్లో.. రాతల్లో.. తెలుగు తనాన్ని పరవశింప చేయడం బాపు, రమణల సాన్నిహిత్యంలో, ఆత్మీయ జీవన తదాత్మ్యంగా అనుసరిస్తున్న 'బ్నిం', 'ఆల్' తెలుగు ఆలుమగలకి 'మిసెస్ అండర్ స్టాండింగ్ 'కానుకగా అందించారు. పెళ్లి కావల్సిన వాళ్లు, కొత్తగా పెళ్లయిన వాళ్లు, ప్రేమలో పడ్డవాళ్లు, పడిపోదామని సరదా పడుతున్నవాళ్లు, అందరికీ ఇది అపురూపమైన స్పందనలు కలిగిస్తుంది. ఈ పుస్తకంలో 'సంకురాత్రుళ్లు' లో మన పల్లెలలో ముత్యాల ముగ్గులు పూయించే కన్నెబంగారుల మెరుపు చుక్కలు, మొగుళ్లుగా మగతనాన్ని ప్రదర్శించే 'మీరెప్పుడూ ఇంతే', కొత్త పెళ్లాం మోజు కథనాలు,ఎన్నో సున్నిత బంధాలు,అ చందాల ప్రేమాద్భుత స్పందనలు చిరునవ్వులు చిలకరింప చేస్తాయి.



ఆడాళ్లూ, మగాళ్లూ కలివిడిగా..విడివిడిగా బాంధవ్యం గుర్తు చేసుకొంటూ చదవాల్సిన పుస్తకం ఇది అంటారు రచయిత. ఇవన్నీ మన జీవితాలలో తొంగి చూసే సన్నివేశాలు, హాలు కలిగించే అనుభవాలు, సంఘటనలు, ఘటనలు కావడంతో మన కళ్లముందు మన తెలుగు ఇంటింటి దాంపత్య సిరిమల్లెల గుబాళింపు అక్షరరూపంలో అందించ గలిగిన బ్నిం హృదయ సౌందర్యాన్వేషణ ఆశ్చర్యపరుస్తుంది. బాపుగారు ఈ స్క్రిప్ట్ చదివి పాతిక బొమ్మలు వేసి యివ్వడంతో ఈ పుస్తకం కాలంలోకి కనుమరుగవకుండా మనల్ని సజీవహాస్య కథాచిత్ర కళాత్మక కావ్యంగా కదిలిస్తూనే ఉంటుంది. అక్షర ప్రచురణల విద్యవెంకట్ అభినందనీయులు.

**(అక్షజ్ఞ పబ్లికేషన్స్, 12-11-1364, పరాశర అపార్ట్‌మెంట్స్, సికింద్రాబాద్)**

**– యర్రమిల్లి**



# పెరుగుతోన్న కరెన్సీ కాలుష్యం!

**డా॥బుర్ర మధుసూదన్‌రెడ్డి**

ఆదిమానవుడు తనకు అవసరమైన సరుకులు పొందడానికి 'వస్తు మార్పిడి' పద్ధతి ద్వారా సమకూర్చుకునేవాడు. కాలక్రమంలో నరుడు తన సౌలభ్యం కోసమంటూ వేల సంవత్సరాలుగా కరెన్సీ నోట్లు, నాణాలను ప్రవేశపెట్టి వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నాడు. మానవుడి జీవితంలో కరెన్సీ అతిప్రధానభాగమైంది. అనునిత్యం కరెన్సీని తప్పక వాడే పరిస్థితి వచ్చింది. ప్రతిరోజు కరెన్సీ చేతులు మారడం అనివార్యమైంది. ప్రపంచదేశాల్లో అన్ని వర్గాల ప్రజలు కరెన్సీ నోట్లను, నాణాలను తమతమ స్థాయిలను బటి వినియోగిస్తున్నారు. అభివృద్ధిచెందిన, చెందుతున్న దేశాలన్నింటిలో కరెన్సీ కాలుష్యం పెనుప్రమాదంగా మారుతోంది. ముఖ్యంగా అధిక జనాభాగల ఇండియాలో పాటు ఇతర పేద దేశాల్లో దీని ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉంది.

### లక్షల చేతులు మారే కరెన్సీ

కరెన్సీ నోట్లను పేపర్, కాటన్ లేదా ప్లాస్టిక్‌లతో తయారు చేస్తున్నారు. నాణాలు మాత్రం మిశ్రమ లోహాలతో తయారవుతాయి. కరెన్సీ వివిధ వర్గాల ప్రజల చేతులు మారినపుడు ఒకరి నుండి మరొకరికి వ్యాధికారక సూక్ష్మజీవులు చేరే ప్రమాదం ఎదురవుతోంది. అపరిశుభ్రత వాతావరణం, చేపల మార్కెట్, మటన్ చికెన్ మార్కెట్, దుమ్ముదూళిలో పనిచేసే వారు, రోడ్ల వెంట అమ్మకాలు జరిపే దుకాణాదారులు, ఆసుపత్రి పరిసరాలు, మునిసిపాలిటీ కార్మికులు మొదలైన వారి చేతుల మీదుగా కరెన్సీ మారితే, హానికారక సూక్ష్మజీవులు వ్యాపించి అనేక అనారోగ్యాలకు కారణం కావచ్చనే వాస్తవం విస్మయాన్ని కలుగచేస్తోంది. సూక్ష్మజీవులతో కరెన్సీ కలుషితం కావటానికి కారణాలుగా దగ్గులు, తుమ్ములు, లాలాజలంతో నోట్ల లెక్కింపు, అపరిశుభ్రత, గాలిలో తేమ, ఉష్ణోగ్రత, అతినీలలోహిత కిరణాలు, గాలి నాణ్యత, సూక్ష్మజీవులు జీవించేకాలం లాంటివి కూడా కరెన్సీ కాలుష్యాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్ని సూక్ష్మజీవులు అతిశీతల, అతిఉష్ణోగ్రతలను కూడా తట్టుకొనుటతో సమస్య తీవ్రత రెట్టింపు అవుతున్నది.

### కరెన్సీ కాలుష్యానికి కారణాలు

కరెన్సీ కాలుష్యానికి కారణమైన సూక్ష్మజీవుల్లో బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, ఈస్ట్ మొదలైన పర్నాజీవులు, కొన్ని రసాయనాలు వస్తాయి. కాటన్, పేపర్ కరెన్సీ, నాణాల ద్వారా ఈ కాలుష్యవ్యాప్తి మరింత ఎక్కువగా ఉంటుంది. తక్కువ విలువగల నోట్లు, నాణాల (5,20,30,50,200) వాడకం అధికంగా ఉండటం వల్ల కరెన్సీ కాలుష్యం వేగంగా వ్యాపిస్తుంది. మార్కెట్‌లో తిరుగుతున్న కరెన్సీ 60 నుండి దాదాపు 100శాతం కాలుష్యానికి గురికావటం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. వివిధ దేశాలలో జరుగుతున్న పరిశోధనల ఫలితాలను బట్టి దాదాపు 93 రకాలైన వ్యాధికారక సూక్ష్మజీవులు కరెన్సీ ద్వారా వ్యాపిస్తున్నాయని నిర్ధితమయ్యింది. భోపాల్ నగరంలో జరిగిన పరిశోధనల్లో 94శాతం కరెన్సీ కలుషితమైందని రుజువైంది. కరెన్సీలోని ఈ సూక్ష్మజీవులు కొన్ని గంటలు, రోజులు, నెలలు జీవిస్తున్నందున మన ఆరోగ్యం ప్రమాదంలో



చిక్కుకోబోతున్నది. ముఖ్యమైన వ్యాధికారక బ్యాక్టీరియాలో వైబ్రోకలరో, బాసిల్లస్, యస్‌పి. స్టఫైలోకోకస్, యస్‌పి, మైకోబాకీరియమ్, ట్యుబర్క్యులోసిస్, మైక్రోకోకస్‌యస్‌పి, స్ట్రోప్టోకోకస్, యస్‌పిపి, ఎస్‌బెరీసియా కోలి, క్లిబ్సియెల్ల యస్‌పిపి, సూడోమెనాస్, ఆరిజినోసా, సాల్మెనెల్లా కలరోసిస్, యస్, ఆరెస్‌లాంటివి వస్తాయి. వ్యాధికారక వైరస్‌లలో కరోనా, కాగ్సాకీ, ఇన్‌ఫ్లుయెంజా, రీనో, ఆస్ట్రరో, హెచ్‌ఏవి, పోలియో, రోటా, హెర్పస్‌వైరస్‌లాంటివి గుర్తించబడినవి.

### కరెన్సీ కాలుష్య దుష్ప్రభావాలు

ఈ వ్యాధికారక సూక్ష్మజీవుల వ్యాప్తితో జ్వరం, ఫుడ్‌పాయిజన్, మూత్ర, జీర్ణనాళ, శ్వాసకోశ, చర్మవ్యాధులు వస్తాయి. విరోచనాలు, వాంతులు సర్వసాధారణంగా కనిపిస్తాయి. న్యూమోనియా, ఇమ్యూన్‌వ్యవస్థపై ప్రభావం గమనించబడింది. వీటిలో కొన్ని సూక్ష్మజీవులు ఆంటిబయాటిక్ మందులకు కూడా లొంగకుండా నిరోధకతను కలిగి ఉన్నాయి.

### నివారణ మార్గాలు

కరెన్సీ కాలుష్యాన్ని తగ్గించుటకు అనేక చర్యలు తీసుకోవల్సిన




సమయం ఆసన్నమైందని గమనించాలి. కరెన్సీ వాడకాన్ని తగ్గించి ఆన్‌లైన్‌లో లేదా ఎటిఎం కార్డులు వాడుతూ నగదు బదిలీ చేయడాన్ని ప్రోత్సహించాలి. పాత కరెన్సీని దఫాల వారీగా శుభ్రపరచాలి. అతిపాత నోట్లను మార్కెట్ నుండి తొలగించాలి. కాటన్, పేపర్ నోట్లకు బదులుగా ప్లాస్టిక్ కరెన్సీని ప్రవేశపెట్టాలి. ఉగ్రవాదులు కరెన్సీని కలుషితం చేసే అవకాశాన్ని తోసిపుచ్చరాదు. కరెన్సీ ముట్టుకున్న ప్రతిసారీ చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలి. నోట్లు లెక్కించినపుడు ఉమ్మివాడరాదు. షూ, సాక్స్, కార్పెట్‌లాంటి అపరిశుభ్ర ప్రదేశాల్లో కరెన్సీని దాయరాదు. నాణాలు లేదా నోట్లను నోట్లో పెట్టుకొనుట అతిప్రమాదకరం. పిల్లలను కరెన్సీకి దూరంగా ఉంచాలి. అధిక జనాభా, పేదరికం, నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న మనదేశంలో కరెన్సీ కాలుష్యం మరో ప్రమాదంగా మారకపూర్వమే మేల్కొని తగు చర్యలు తీసుకుంటూ అభివృద్ధి పథంలో పయనించేందుకు అందరిలో అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుదాం. ❑



## లక్ష రూపాయల పెళ్లి విందు

ఎంత పెద్ద స్టార్ హోటలైనా సరే ఓ వ్యక్తి భోజనం చేయడానికి ఎక్కువలో ఎక్కువగా 10వేల రూపాయలు కావొచ్చు. కానీ అక్కడేమో మనిషికి లక్షరూపాయలని ప్రకటించారు. అలాగని అది స్టార్‌హోటల్‌ని తలదన్నే ఇంద్రభవనమేం కాదు. అదో మామిడితోట..పైగా ఆ విందు ఏర్పాటు చేసిందేమో ఆరుబయట. అయినా సరే టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. 105 మంది హాజరైపోయారు. వాళ్లని బ్యాండుమేళంతో తీసుకెళ్లి పొడవైన డైనింగ్ టేబుల్ ముందు కూర్చోబెట్టారు. దాదాపు మూడుగంటలపాటు సాగిందా భోజన కార్యక్రమం. 'అంతసేపు తిన్నారా?' అనుకుంటున్నారేమో! మధ్యమధ్య కాస్త విరామం ఇచ్చి వాళ్ల తింటున్న, తినబోతున్న భోజనం స్పెషాలిటీ ఏమిటో వివరించారు మనదేశంలోని 20మంది ప్రసిద్ధ చెఫ్‌లు! మొత్తానికి భోజనం చేయడాన్ని కూడా ఓ ఉత్సవంలా మార్చారక్కడ! ఎక్కడ అంటారా..చెన్నైలోని 'హనురెడ్డి మానయంగోఫార్మ్స్'లో జరిగింది కార్యక్రమం.





కథ

# పెద్ద మనసు

**అమ్మా!** నేను స్కూలుకి వెళుతున్నా.. టైమయింది అన్నాడు హితార్థ్. చిన్నా..ఈ రోజు నువ్వు స్కూలుకి వెళ్లొద్దు. నాతోపాటు ఆస్పత్రికి రావాలి అన్నది తల్లి. స్కూలుకి వెళ్లొద్దు అనే మాట తల్లి నోట వినగానే ఎగిరి గంతేశాడు. దేనికమ్మా! వెళ్లొద్దు అంటున్నావు అడిగా హితార్థ్.

'నీ చిట్టి తమ్ముడు ఉధీర్ణ్‌కు ఏడాది నిండింది కదా! ఈరోజు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి టీకా వేయించాలి. నాన్నకు ఆఫీసులో మీటింగు ఉంది. పొద్దునే బయలుదేరి వెళ్లారు. అందుకే తోడుగా నిన్ను రమ్మంటున్నాను' అన్నది తల్లి.

'తమ్ముడిని నేను ఎత్తుకుంటానమ్మా!' అంతోషంగా అన్నాడు.

'వద్దు నువ్వు సరిగ్గా వాడ్ని ఎత్తుకోలేవు. ఇప్పుడు నువ్వు చదివేది మూడో తరగతి. నాలుగులోకి వచ్చాక ఉధీర్ణ్‌ను ఎత్తుకోవచ్చు' అన్న తల్లి మాటలు హితార్థ్‌ను నిరుత్సాహపర్చాయి. తల్లి ఇంటికి తాళం వేసింది. ఇంతలో ఆటో పక్కన ఆగింది. హితార్థ్ తల్లితో కలిసి ఎక్కాడు.

'నువ్వు నాకు చెప్పకుండా ఎటూ పోవద్దు ఎవరు పిలిచినా వెళ్లొద్దు. నా చెయ్యి వదలకూడదు అన్నది తల్లి. అలాగే అన్నాడు హితార్థ్. ఓపీ రాయించుకోటానికి తల్లి లైనులో నిలబడగా వెనకాలే హితార్థ్ కూడా నిలబడ్డాడు. ఓపీ రాయించుకున్నాక చీటీ తీసుకుని సంబంధిత పిల్లల వైద్యుల సంప్రదించింది హితార్థ్ తల్లి. అక్కడ నర్సు వైద్యుని సలహా మేరకు పరీక్షించి టీకా వేశారు. తల్లి ఒకవైపు ఉధీర్ణ్‌ను సముదాయిస్తూనే హితార్థ్‌ను దగ్గరకు తీసుకుంది. వైద్యుడు వేసిన టీకాకు పిల్లవాడికి జ్వరం వస్తుందని భయపడవద్దని చెప్పారు. జ్వరం తగ్గకపోతే సిరప్ వాడమని ఓపీ చీటీ మీద రాశారు. ఉధీర్ణ్‌ను భుజాన వేసుకుని హితార్థ్ చేయి పట్టుకుని మందులు ఇచ్చే ప్రదేశానికి బయలుదేరింది. మందులు పంపిణి చేసే ప్రదేశంలో రెండు లైన్లు ఉన్నాయి. పురుషుల లైను రద్దీగా ఉండగా మహిళల లైనులో తక్కువమంది ఉన్నారు. హితార్థ్ తల్లి మందుల కోసం మహిళల లైనులో నిలబడింది. ఇంతలో పురుషుల లైనులో తొక్కిసలాట ప్రారంభమైంది. అంతవరకు లైనులో ముందు వరుసలో నిలబడ్డ ఓ వృద్ధుడిని కొందరు పక్కకు తోసేశారు. దాంతో ఆ వ్యక్తి కింద పడ్డాడు. అతను పైకి లేవాలని ప్రయత్నిస్తున్నా సాధ్యం కావటం లేదు. అతని చేతిలోని మందుల చీటి ఫ్యాను గాలికి దూరంగా పడింది. హితార్థ్ పరుగున వెళ్లి చీటి తెచ్చి తాతా! తీసుకో అని ఇచ్చాడు. బాబు! దాహం వేస్తుంది అన్నాడు వృద్ధుడు.

హితార్థ్ పరుగున తల్లి దగ్గరకు వెళ్లి బాటిల్ తెచ్చి మూత తీసి తాతా! తాగు అంటూ ఇచ్చాడు. ఆ వృద్ధుడు గబగబా నీళ్లు తాగి తేరుకున్నాడు. హితార్థ్ వైపు కృతజ్ఞతగా చూస్తూ లైను దగ్గర వెళ్లాడు. ప్రతి ఒక్కరూ వృద్ధుని వెనక్కి తోసేశారు. కొందరేమో ఆయన వయసును కూడా గుర్తించలేదు. పైగా ఇప్పుడే వచ్చి ముందు నిలబడతావా! అని మాటలు తూలారు. వృద్ధుడు ఎంత ప్రయత్నించినా ముందుకు పోలేకపోతున్నాడు. చివరకు చేతగాక ఒక బల్ల మీద కూర్చున్నాడు. ఇదంతా చూస్తున్న హితార్థ్‌కు వృద్ధుడి పరిస్థితి జాలనిపించింది. మెల్లగా దగ్గరకు వెళ్లాడు.

'తాతా! ఏం కావాలి?' అని ప్రశ్నించాడు.

'బాబూ! ఉదయం ఆరోగ్యం బాగలేకపోతే ఇక్కడకు వచ్చాను. డాక్టర్ మందులు రాశారు. వాటికోసం ఈ అవస్థ, ఎవరూ సాయం చేయడం లేదన్నాడు' ఆ వృద్ధుడు.

'తాతా నీ మందుల చీటి నాకివ్వు..తెచ్చిస్తా' అన్నాడు హితార్థ్. ఆ చీటిని తన తల్లికి ఇచ్చి, మందులు తీసుకోమని కోరాడు. వృద్ధుడి పరిస్థితిని తన తల్లికి వివరించాడు హితార్థ్.

హితార్థ్ తల్లి మొదట ఉధీర్ణ్ మందులు తీసుకుంది. ఆ తర్వాత వృద్ధుడి మందులు కూడా తీసుకుంది. వాటిని తీసుకున్న హితార్థ్, పరుగున వెళ్లి 'తాతా! ఇదిగో నీ మందులు తీసుకో' అన్నాడు.

వృద్ధుడు హితార్థ్‌ను ఉద్దేశించి నా ఆయుష్షు కూడా పోసుకుని నిండునూరేళ్లు చల్లగా ఉండు' అని దీవించాడు.

ఇతరులకు సాయం చేయాలనే ఆలోచన హితార్థ్‌కు రావడంతో తల్లి సంబరపడింది.

– తమ్మవరపు వెంకటసాయి సుచిత్ర





## బాలగేయం

### చెడుకు దూరం



కలసి మెలసి ఉంటాం
అల్లరి అసలే చేయం
చక్కగా చదువుతాం
గురువులకు
నమస్కరిస్తాం
తల్లిదండ్రుల
మాట వింటాం
పాఠశాలకు
మంచి పేరు తెస్తాం
అందరికీ
ఆదర్శమవుతాం
అందరిలో
స్ఫూర్తి నింపుతాం
పిల్లలం మేం
ఆడేపాడే నవ్వులం మేం

**- కనుమ ఎల్లారెడ్డి**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- కె.వాసుదేవ్,** వరంగల్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పీసా టవర్‌ను ఎవరు నిర్మించారు?**

**జవాబు: వాసుదేవ్!** ఎనిమిది అంతస్థుల పీసా టవర్‌ను రోమ్ చక్రవర్తులు నిర్మించారు. దీని మీద ఇటాలియన్‌లకు అమితమైన ప్రేమాభిమానాలు. క్రీ.శ. 1173లో నిర్మాణం ప్రారంభమై 1360-70 నడుమ పూర్తయింది. దీని ఎత్తు 179 అడుగులు(55 మీటర్లు), చుట్టుకొలత 15.5 మీటర్లు. ఇది వృత్తాకారపు నిర్మాణం. దీని గోడలు 4 అడుగుల మందంతో ప్రారంభమై, 2 అడుగుల మందం ఎత్తుతో ఉన్నాయి. భూమి మీద 15 ఆర్చ్‌లతో ప్రారంభమై పై అంతస్తుల మీద 30 ఆర్చ్‌లు ఉన్నాయి. పై అంతస్తులో ఒక గంట ఉంది. 294 మెట్లు ఎక్కితే టవర్ అగ్ర భాగాన్ని చేరుకోవచ్చు. పీసా పట్టణంలోని క్రైస్తవ మత దేవాలయాలలో ఒకానొక భాగమే లీనింగ్ టవర్ ఆఫ్ పీసా. బాప్టిస్టెరీ, చర్చి. దీనిని బెల్ టవర్‌గా వ్యవహరిస్తారు. గురుత్వాకర్షణ శక్తి దీని నిర్మాణానికి ఆలంబనగా ఉంది.

**- బి.అమూల్య,** విజయవాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వాయువులు ఏవిధంగా వ్యాకోచిస్తాయి?**

**జవాబు: అమూల్య!** ఉష్ణోగ్రత పెరిగితే వాయువులు వ్యాకోచిస్తాయి. ఉష్ణోగ్రతను తగ్గిస్తే సంకోచిస్తాయి. వాయువులను సంకోచింపజేసి వదిలినప్పుడు అవి వాటి పరిసరాలలోని ఉష్ణాన్ని గ్రహిస్తూ వ్యాకోచిస్తాయి. ఫ్రిజ్‌లలో చల్లదనం ఏర్పడే చర్య వెనుక ఉన్న మూల సూత్రం ఇది. ఫ్రిజ్‌లోని కంప్రెసర్‌లో కొన్ని రకాల వాయువులను నింపుతారు. కంప్రెసర్ వీటిని సంకోచింపజేసి, దానికి అమర్చిన సన్నటి గొట్టంలోకి పంపుతుంది. గొట్టంలోని వాయువు పరిసరాలలోని ఉష్ణాన్ని గ్రహిస్తూ తిరిగి కంప్రెసర్‌ను చేరుతుంది. ఈ ప్రక్రియ పదే పదే జరగడం వల్ల ఫ్రిజ్ లోపలి ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతుంది. ఈ కారణం వల్ల ఫ్రిజ్ లోపల చల్లగా ఉంటుంది.

# రాబందుల రెస్టారెంట్





**రాబందుల** సంఖ్య బాగా తగ్గిపోతోందన్న వార్తలు ఈ మధ్య వింటూ ఉన్నాం కదా! వాటి సంఖ్యని పెంచడానికి ఓ పరిష్కారాన్ని కనిపెట్టింది కర్ణాటక అటవీ శాఖ. ఆ పక్షుల కోసం బందిపుర అడవిలో కొంతభాగాన్ని రాబందుల ఆహార కేంద్రంగా మార్చింది. దానికి 'వల్చర్స్ రెస్టారంట్' అనే పేరు పెట్టింది. దక్షిణ భారతదేశాన ఇలాంటి 'రెస్టారెంట్' ఏర్పాటు కావడం ఇదే ప్రథమం. అడవుల్లో చనిపోయిన ఏనుగుల కళేబరాల్ని కూడా ఇక్కడికి తరలించి రాబందులకు ఆహారంగా ఇస్తున్నారు అటవీ అధికారులు. వాళ్లే కాదు చుట్టుపక్కల పల్లెల్లోని రైతులు కూడా చనిపోయిన తమ పశువుల్ని ఈ రెస్టారంట్‌కి తీసుకురావడం విశేషం.




పర్యావరణ చక్రంలో రాబందుల పాత్ర చాలా కీలకం. అడవిలో చనిపోయిన జంతువుల కళేబరాలు కుళ్లి వ్యాధులు ప్రబలకుండా కాపాడటం వాటి పని. కానీ మాంసం కోసం పెంచే పశువులకి వాడే కొన్ని రకాల యాంటిబయోటిక్స్ వల్ల కూడా ఆయా జంతువుల మృత కళేబరాలను తిన్న రాబందులు అనారోగ్యం పాలై, ఆ జాతి అంతరించిపోయే స్థితికి వచ్చింది. అందుకే వాటి సంఖ్య పెరిగేదాకా ఈ రెస్టారంట్ సేవల్ని అందిస్తామంటున్నారు అటవీ అధికారులూ, చుట్టుపక్కలున్న పల్లెవాసులు.

# పక్షుల దాహం



మీరు పక్షులను ప్రేమిస్తారా? అయితే ఈ వేసవి తాపంలో తాగునీటికోసం అల్లాడే పక్షులెన్నో ఉన్నాయి. వాటి దాహం తీర్చండి. మీరు మీ బాల్కనీలూ, ఇతర ఖాళీస్థలాల్లో బర్డ్‌పాట్స్‌ను పెట్టండి. ప్రస్తుతం బర్డ్‌పాట్స్‌ను అందంగా తయారుచేసి, మార్కెట్లో అమ్ముతున్నారు. మీరు కూడా స్వయంగా తయారు



చేసుకోవచ్చు. వాడేసిన వాటర్ బాటిళ్లు, కాఫీ కప్పులు, కొబ్బరి చిప్పలు ఇలా వీలున్న వాటిని బర్డ్‌పాట్స్‌గా మార్చేయొచ్చు. బాల్కనీలో వాటికి అనువైన చోట తగిలించి, కాసిన్ని నీళ్ల పోసి ఉంచితే నీటి కోసం అన్వేషించే పక్షులు వీటి మీద వాలి వాటి దప్పిక తీర్చుకుంటాయి.

# గుండెపోటు పసిగట్టొచ్చు!



'పొగతాగడం మానేయండి.. గుండెపోటు రాదు' అంటే చాలామంది పెడచెవిన పెట్టేస్తారు. 'ఆరునెలల్లో మీకు గుండెపోటు వచ్చే ప్రమాదముంది. రోజూ వ్యాయామం చేయండి, మందులు వాడండి. సిగరెట్టూ మద్యంలాంటివాటిని దూరంగా పెట్టండి' అంటే వింటారు కదా! అందు కోసమే ఓ అధునాతన రక్తపరీక్షని కనిపెట్టారు స్వీడన్ ఉప్పలా యూనివర్సిటీకి చెందిన జొహాన్‌సన్ స్ట్రామ్ అనే ప్రొఫెసర్. గుండెపోటుకి కొద్దికాలానికి ముందే శరీరం కొన్ని అణువుల్ని (మాలిక్యూల్స్) విడుదల చేస్తుందట. అలాంటి 90 అణువుల్ని (మాలిక్యూల్స్) విడుదల చేస్తుందట. అలాంటి 90 అణువుల్ని -ప్రపంచంలోని 1.69 లక్షల మంది రక్త నమూనాలను విశ్లేషించి మరీ గుర్తించారాయన. రక్తంలో ఇవి ఎంత ఎక్కువగా కనిపిస్తే గుండెపోటు అవకాశం అంత ఎక్కువగా ఉంటుందని సన్‌స్ట్రామ్ చెబుతున్నారు. ఈ అణువుల్ని అత్యంత వేగంగా విశ్లేషించి చెప్పడానికి ప్రత్యేక ఆన్‌లైన్ టూల్‌నీ సిద్ధం చేశారు. కేన్సర్‌లాంటి రోగాలుంటే కారణాలు ఉంటే వాళ్లని 'హైరిస్కు' రోగులుగా గుర్తించాలని చెబుతున్నారు.



# చివరి మజిలీ

ఈవారం కవిత్వం


**జీవితంలో** పరిగెత్తి పరిగెత్తి
అలుపొచ్చాక
నువ్వు ఇక్కడ ఆగాల్సిందే
గమ్యం ఏదైనా సరే
నువ్వు చివరి మజిలీ దాకా
ప్రయాణించాల్సిందే
ఎన్నింటికో ఆరాటపడ్డ
నీ మనసులోని భ్రమలన్నీ
ఇక్కడే తొలుగుతాయి
భవబంధాలు సిరిసంపదలన్నీ అశాశ్వతం అనే
సత్యాన్ని
ఇక్కడే నువ్వు గ్రహిస్తావు
నీ ఒంటరి ప్రయాణంలో
నీవు జీవించినన్నాళ్లు
మంచేదైనా
చేసుంటే అదే శాశ్వతమై నిలుచుంటుంది.
దేహాన్ని నీ ఆత్మ త్యజించి
అనంత వాయువుల్లో కలిసిపోయాక
నీ దేహం మట్టితో మమేకమై
దేహాత్మ జీవాత్మను వెతుకుతూ పరమాత్మను చేరుకుంటుంది
జీవనయానం చివరి అంకానికి చేరుకున్నాక
సమాధి స్థలే ముగింపు.

– నెల్లుట్ల సునీత

# నిశ్శబ్ద తీరాల నిరీక్షణ

సాయంత్రాలన్నీ వొంటరిగా
రగిలిపోతున్నాయి
ఏ వేళకొస్తావో..
మబ్బులు చాటైన వెన్నెల్లా
తెలియదు.
ఏ వొద్దుకో అల్లుకొన్న కలల్ని
ఈ వొద్దుకు చేర్చావు
ఎక్కడో ఆశల నౌకను
లంగరు వేసినట్టు
అలల కదలిక లేని
తీరాన నీవు
ఈ ఏకాంత సమయాన
మౌనమైన నేను,
ఈ తెలియని కాలాల
నిశ్శబ్ద తరంగాల మధ్య
ఏ వేళకో నీ రాక.
ఏనాటికో
నీ మానసవీణ కదలిక

– రవి మాగంటి





# మౌనంగానే మాటలాడు..

జీవితంలో గెలుపుకీ
మానవ సంబంధాలకీ
మాటలెన్నో అవసరం
మౌనమూ అత్యవసరం.

మాటలకి భాష
ముఖ్యం
స్వరంలో హెచ్చుతగ్గులు
అర్థాలలో అపార్థాలు
మౌనానికి బాధల్లేవు.

ఒక శాంతం, ఒక రౌద్రం
ఒక గాథ, ఒక బాధ
హావభావాల తోడనే
విస్పష్టంగా విస్తృతంగా
వినమ్రంగా చెప్పగలం.

శబ్దానికి
మూలసూత్రం
నిశ్శబ్దం కనుకనే
చూపులతో, సైగలతో
అంతరంగా విష్కరణం
అద్భుతంగా చేయవచ్చు.
నిశ్శబ్దం సాక్షిగా సదా
మదిలోని భావాలను
తేటతెల్లంగా చెప్పగా
మౌనంగానే మాటలాడు!!

– జి.మూర్తి

కథ

# మంచి ఆలోచన

కైపు ఆదిశేషా రెడ్డి

**రోజులాగే ఆరోజు కూడా పొద్దున్నే పొలం చుట్టొచ్చిన పరంధామయ్య కాలకృత్యాలు ముగించుకొని, పూజ గదిలోకి వెళ్లాడు. అప్పటికే పూజకవసరమైన సామగ్రిని సిద్ధంగా వుంచింది ఆయన భార్య దమయంతి. ఓ అరగంటకుగానీ ఆయన పూజ గదిలోంచి బయటకు రాడు. ఆ తర్వాతగానీ ఆహారం తీసుకోడు. అది అతని దినచర్య.**

రాఘవాపురంలో గ్రామ పెద్దగా పది మందిలో మంచి పేరుంది పరంధామయ్యకు. దైవభక్తి, దాన గుణం ఆయన ప్రత్యేకతలు. తనకున్న దానిలో నలుగురికి అంతో యింతో సాయం చేసేవాడు. చుట్టుపక్కల గ్రామాలలో కూడా పరంధామయ్య గురించి తెలుసుకున్నవారు ఎప్పుడైనా కష్టాల్లో వుంటే వచ్చి ఆయన దగ్గర సాయం పొందేవారు. ముఖ్యంగా ఆయన అనాథాశ్రమాలకు అంటే వెనకా ముందూ చూడకుండానే విరాళాలు యిచ్చేవాడు. దానికి కారణం లేకపోలేదు. పెద్దలు సంపాదించి యిచ్చిన ఆస్తిని తన కష్టంతో మరింత పెంచాడు. ఆస్తి అయితే పెరిగింది కానీ దానిని తినటానికి వారసులు పుట్టలేదు. పిల్లల కోసం ఎంతో తాపత్రయపడ్డారు. గుడులు, గుట్టలు తిరిగారు. ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో విసుగొచ్చి మానుకున్నాడు. మరో పెళ్లి చేసుకోమని బంధుమిత్రులు చెప్పారు. దమయంతి కూడా రెండో పెళ్లికి అడ్డు చెప్పలేదు. అయినా పరంధామయ్య ఏమాత్రం తలొగ్గలేదు.

"పోనీ... పెంచుకోడానికి ఓ బిడ్డను తెచ్చుకుందామండీ!" దమయంతి ఉండబట్టలేక అడిగిందో రోజు.

"లేదు దమయంతీ.. యెవరో ఒకరిని పెంచుకుంటే ఆ బిడ్డ కోసం వుంచాలనే స్వార్థంతో సంపాదనను ఇతర అనాథ పిల్లలకు దానం చేయలేం. ఒక అనాథని పెంచి పెద్ద చేయడం కన్నా పది మందికి సాయపడటం బాగుంటుందనేది నా ఉద్దేశం" చెప్పాడు పరంధామయ్య.

భర్త నిర్ణయాన్ని కాదనలేక "అలాగేనండీ... మీ యిష్టం" అంది.

అప్పటి నుండి ఏ అనాథాశ్రమంవారు వచ్చి విరాళం అంటే కాదనడు. తోచినంత యిచ్చి పంపటం పరిపాటి అయిపోయింది. అనాథ బాలలు అన్న అతని సెంటిమెంట్ తెలిసినవారు అప్పుడప్పుడూ వచ్చి అంతో యింతో విరాళాలు పట్టుకుపోయేవారు.

"ఏవండీ!" బయట పిలుపు విని వంటగదిలో పనిలో వున్న దమయంతి వచ్చి తలుపు తెరిచింది.

బయట ఒక కాషాయాంబరధారి, ఆ వెనుక నలుగురు వ్యక్తులు వున్నారు. పొద్దున్నే ఎవరో చందాకొచ్చారనే విషయం అర్థం చేసుకున్న ఆమె "వారు పూజలో వున్నారు" అంది.

"పర్లేదమ్మా.. వారు వచ్చేదాకా వుంటాం" వారిలో ఒకతను చెప్పాడు.

"అలాగే.." అని కొట్టం వైపు చూసి "రంగా.. యిలా వచ్చి ఆ హాల్లోని కుర్చీలు వరండాలో వెయ్" అంది.

రంగడు బిర బిరా లోపలికెళ్లి కుర్చీలు తెచ్చి వరండాలో వేశాడు. పెద్ద స్వామి కుర్చీలో ఆసీనుడు కాగా మిగతావారు ఆయన వెనకాల నిలుచున్నారు. పరంధామయ్య కోసం చూడసాగారు. పూజగదిలో వున్న పరంధామయ్యకు బయట సంగతి లీలగా వినిపించటంతో కొంచెం ముందుగానే పూజ ముగించుకొని బయటకు వచ్చాడు. కుర్చీలోని పెద్ద స్వామికి నమస్కరించాడు. ఆయన ప్రతి నమస్కారం చేసి "దీర్ఘాయుష్మాన్ భవ" అంటూ ఆశీర్వదించాడు.

ఎదురుగా వున్న మరో కుర్చీలో కూర్చుంటూ "పెద్దలు పొద్దున్నే యిలా వచ్చి మా యింటిని పావనం చేశారు.. సంతోషం" అన్నాడు పరంధామయ్య.

"అయ్యా, మాది తిరుపతి. అక్కడ ఒక ఆశ్రమంలో మా ఈ గురుదేవులుగారు వుంటారు. ఆశ్రమంలో అనాథలను చేరదీసి వారికి తిండి, బట్టలు సమకూర్చడమే కాక, చదివించి వారి బతుకు వారు బతికేలా శిక్షణ యిప్పిస్తారు. ఆశ్రమానికి మంచి పేరు రావడంతో పిల్లల సంఖ్య బాగా పెరిగిపోయింది. ప్రభుత్వ సాయం తీసుకోవడం మా గురువు గారికి యిష్టంలేదు. దాతల సాయంతోనే నిర్వహిస్తున్నారు. మేం ప్రతివారినీ, ప్రతిచోటా అడిగి చందాలు పోగు చేయదలచుకోలేదు. దాతృత్వపు మనసున్న మీలాంటి వారిని మాత్రమే కలసి విరాళాలు సేకరిస్తున్నాం" వారిలో ఒకతను తాము ఎందుకు వచ్చారో సవివరంగా చెప్పాడు.

అంతలోనే మరొకతను అందుకొని "ఈ ప్రాంతంలో మీ దాతృత్వం గురించి తెలిసి మిమ్మల్ని కలసి ఆశ్రమ నిర్వహణకు సాయం అడగాలని స్వయంగా మా గురువుగారే వచ్చారు" అన్నాడు.

"పెద్దలు యింత దూరం నన్ను వెతుక్కుంటూ రావడం నాకూ ఆనందంగా వుంది.



నా చేతనైన సాయం చేస్తాను" చెప్పాడు పరంధామయ్య.

తన సంచిలోంచి ఒక ఆల్బం బయటలకు తీసి "అయ్యగారూ! యివిగో మా ఆశ్రమం ఫోటోలు" అంటూ దానిని పరంధామయ్య చేతికి యిచ్చాడు మరో శిష్యుడు.

పరంధామయ్య ఫోటోలు చూడసాగాడు. అందులో ఆశ్రమం ఫోటోలు, చదువుకుంటున్న పిల్లలు, ఆహారం తీసుకుంటూ పిల్లలు, ఆడుకుంటూ... అలా ఆశ్రమంలో తీసి వివిధ ఫోటోలు వున్నాయి. పరంధామయ్య వాటిని తిరగేస్తూ చూస్తూ వుంటే వారంతా ఆయన ముఖకవళికలను గమనిస్తూ వున్నారు.

ఆయన ఆల్బం చూడటం పూర్తి చేసి తిరిగి యివ్వగానే మరో శిష్యుడు "అయ్యా.. యివిగో వీటిని కూడా ఒకసారి చూడండి" అంటూ ఒక రశీదు పుస్తకం యిచ్చాడు. అందులో విరాళాలు యిచ్చిన దాతల వివరాలున్నాయి. మరోదానిలో దాతల అడ్రసులతో పాటు వారి ఫోటోలు కూడా వున్నాయి.

"యివన్నీ మీకు నమ్మకం కోసం చూపిస్తున్నాం. ఆధారాలు లేకుండా విరాళాలు అడగటం ధర్మం కాదు గదా! అందుకే వాటిని పరిశీలించమని మీకు యిచ్చాం. మా మీద మీకు నమ్మకం కలిగితే మనసుకి తోచినంత విరాళం యివ్వండి. కాదన్నా మేమేమీ బాధ పడం. ఆ భగవంతుడు మరొకరిని చూపగలడని మా నమ్మకం" పెద్దగా పరిచయమైన వ్యక్తి చెప్పాడు.. పరంధామయ్య వంక చూస్తూ.

"యివన్నీ చూసినా నమ్మకపోవడమేంటి? తప్పక నా వంతు సాయం చేస్తాను" చెప్పాడు పరంధామయ్య.

కొద్ది క్షణాలు మౌనంగా ఆలోచించిన పరంధామయ్య లోపలికెళ్లి పది వేల రూపాయలతో తిరిగొచ్చి దానిని గురువుగారికి యిచ్చాడు.

ఆయన దానిని కళ్లకద్దుకొని తన జోలెలో వేసుకున్నాడు. మరో శిష్యుడు పరంధామయ్య గారి వివరాలను రాసి, రశీదు యిచ్చాడు.

ఆశ్రమానికి సంబంధించిన వివరాలుగల ఒక అడ్రసు కార్డు యిచ్చి "పరంధామయ్యగారూ, మీ సాయానికి కృతజ్ఞతలు. మీరు ఎప్పుడైనా తిరుమలకు వచ్చినప్పుడు తప్పక ఆశ్రమానికి రండి. అక్కడ మీలాంటి దాతల సాయంతో పెరుగుతున్న అనాథ బాలలను ఆశీర్వదించి వెళ్లండి" చెప్పాడు పెద్ద స్వామి.

"తప్పకుండా..! అక్కడకు వచ్చినప్పుడు మరింత విరాళాన్ని కూడా తమకు యిస్తాను" చెప్పాడు పరంధామయ్య. ఈలోగా దమయంతి వారికి అల్పాహారం కూడా సిద్ధం చేయడంతో వాటిని స్వీకరించి వీడ్కోలు తీసుకున్నారు.

ఓ ఆరు నెలల తర్వాత పరంధామయ్య తన భార్య దమయంతితో కలసి తిరుమలకు వెళ్లి స్వామిని దర్శించుకొని, తిరుపతికి రాగానే ఆశ్రమం గుర్తొచ్చింది. ఆరోజు విరాళం తీసుకొని వారు యిచ్చిన కార్డులోని అడ్రస్ చెప్పి ఆటోడ్రైవర్‌కి చెప్పి బయలుదేరారు.

కార్డులో వున్న అడ్రస్ ప్రకారం ఆ ప్రాంతమంతా తిరిగినా అక్కడ వారికి ఎలాంటి ఆశ్రమం కనిపించలేదు. ఎటు చూసినా బహుళ అంతస్తుల భవనాలే వున్నాయి. ఒకచోట ఆటో ఆపి ఆ ప్రాంతీయులకు అడ్రస్ కార్డు చూపి వివరాలడిగాడు పరంధామయ్య.

ఎవరిని అడిగినా "పదేళ్ల నుండి మేం యిక్కడే వుంటున్నాం. మీరు చెప్పే అలాంటి ఆశ్రమంగానీ, అనాథ శరణాలయంగానీ మేం చూడలేదు" అని చెప్పారు.

"అందులో ఫోన్ నంబరుందిగా... కాల్ చేయండి..." అంది దమయంతి.

ఆ నంబరుకు ఫోన్ చేశాడు పరంధామయ్య.

"మీ నంబరు మరోసారి సరిచూసుకోండి. ఈ నంబరుతో ఏ ఫోన్ పని చేయటం లేదు" అని వినిపించి పరంధామయ్య ఖంగుతిన్నాడు.

ఆరోజు తమ ఊరికి వచ్చినవారు దొంగస్వాముల ముసుగులో తనను మోసం చేశారని గ్రహించి ఎక్కి "బస్టాండు" అన్నాడు.

"నాకు ఆరోజే అనుమానం వచ్చిందండీ... వారు ఏదో మోసం చేస్తున్నారని. చెపితే మీరు కోప్పడతారని వూరకుండిపోయాను. దానం చేయడం తప్పు కాదు. కానీ అపాత్ర దానం మంచిది కాదండీ. మీ మంచితనాన్ని, మెతకదనాన్ని ఆసరాగా తీసుకొని చాలా

**"అందులో ఫోన్ నంబరుందిగా... కాల్ చేయండి..." అంది దమయంతి.**

**ఆ నంబరుకు ఫోన్ చేశాడు పరంధామయ్య.**

**"మీ నంబరు మరోసారి సరిచూసుకోండి. ఈ నంబరుతో ఏ ఫోన్ పని చేయటం లేదు" అని వినిపించి పరంధామయ్య ఖంగుతిన్నాడు.**

మంది అయినదానికీ కానిదానికీ చందాలు అడగటం, మీరు చేతికి ఎముకలేని వాడిలాగా దానం చేయడం బాగలేదు" చాన్స్ దొరికింది కదాని సున్నితంగా క్లాసు పీకింది దమయంతి.

"నిజమే..! నా మంచితనాన్ని ఇలా దెబ్బ కొడతారని వూహించలేదు. అనాథ పిల్లలంటే నాకు ఎంత అభిమానమో నీకు తెలుసు కదా! అనాథాశ్రమం అంటే ఎందుకో నా మనసు నిలవదు. దిక్కులేని పిల్లలంటే నేను మరేదీ ఆలోచించను. అది నా సెంటిమెంట్. సరిగ్గా ఆ దొంగవెధవలు నా బలహీనతను తెలుసుకొని వచ్చినట్లున్నారు. ఇకమీద జాగ్రత్తగా వుంటాను" చెప్పాడు పరంధామయ్య.

"ఇదంతా చూస్తుంటే నాకో ఆలోచన వచ్చిందండీ.. మీరు ఆలోచిస్తానంటే చెపుతా"

"చెప్పు... నీ ఆలోచన మంచిదైతే అలాగే చేద్దాం"

"ఇలా అనాథాశ్రమాలకని ఎవరికో ముక్కూ మొఖం తెలియని వారికి సొమ్మంతా ధారబోయడం కంటే మనమే మన ఊరిలో ఒక అనాథ శరణాలయం పెట్టి చుట్టుపక్కల ప్రాంతాలలోని దిక్కులేని, పేద పిల్లలను దగ్గర తీసి కూడూ, గుడ్డ పెట్టి చదివిద్దామండీ!" చెప్పింది దమయంతి.

"నిజమే. నువ్వు చెప్పింది చాలా బాగుంది. ఇంత మంచి ఆలోచన మనకు యిన్నాళ్లకు వచ్చింది. రేపటి నుండే ఆ పని ప్రారంభిద్దాం!" దమయంతి చేతిని తన చేతిలోకి తీసుకొని తన నిర్ణయం ప్రకటిస్తూ "సరేనా!" అన్నట్లు ఆమె వైపు చూశాడు.

ఆమె తృప్తిగా భర్త వంక చూసింది.

# వేసవి ఫలాలు

కాలానుగుణంగా లభించే పండ్లను తింటే రోగాలు రావని నానుడి. అయితే అమ్మో! రోజూ పండ్లు కొనే శక్తి లేదనే చెప్పేవారున్నారు. ఖరీదైన పండ్లు తింటేనే ఆరోగ్యం లభిస్తుందని అనుకోవడం అపోహ. ప్రతి పండులోనూ పోషకాలు ఉంటాయి.





## మల్బరీ

ఎండాకాలంలో లభించే పండ్లలో మల్బరీ ఒకటి. వీటిని బొంతపండ్లు అని కూడా పిలుస్తారు. ఈ పండ్లను డ్రై ఫ్రూట్స్ మాదిరిగా ఉపయోగిస్తారు. ఎండిన 100 గ్రాముల బెర్రీస్‌లో సుమారు నాలుగు వందల కేలరీలు ఉంటాయి. ఇందులో ఉండే ఫైబర్, పెక్టిన్ జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాని వృద్ధి చేస్తుంది. పేగుల్లో ఇమ్యూనిటీ తగ్గటానికి కారణం ఫైబర్ తక్కువగా ఉండే ఆహారం తీసుకోవటమని అధ్యయనాల వల్ల తెలుస్తోంది. వీటిలో విటమిన్ సి, కె ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈ పండ్లు రక్తంలో ఉంటే బ్యాక్టీరియాని నిర్మూలిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను సమన్వయ చేస్తాయి. కొన్ని దేశాల్లో మధుమేహానికి తయారు చేసే ఔషధాల్లో వీటిని ఉపయోగిస్తారట.



## రెడ్ డేట్స్

చూడటానికి రేగుపండ్లు, ఖర్జూరాలను పోలి ఉంటాయి. ఈ పండ్లు మగ్గినకొద్దీ ముడతలు పడతాయి. వీటి పుట్టిల్లు చైనా అయినా ఇప్పుడు చాలా ప్రాంతాల్లో దొరుకుతున్నాయి. వీటిని చైనీస్ డేట్స్ అని కూడా పిలుస్తారు. ఈ చెట్లు 16 నుంచి 39 అడుగుల ఎత్తు వరకు ఎదుగుతాయి. రెడ్స్ డేట్స్‌ను యథాతథంగా తినవచ్చు. ఈ పండ్లతో జ్యూస్ తయారు చేసుకోవచ్చు. వీటిలో యాంటీ డిప్రెసెంట్ గుణాలు ఎక్కువగా ఉన్నందువల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. నరాల వ్యవస్థకు రక్షణ కల్పిస్తాయి. శరీరంలో చేరిన బ్యాక్టీరియాను నశింపచేస్తాయి. రక్తపోటును అదుపులో ఉంచుతాయి.

## 'పనస'లో

వేసవిలో అధికంగా లభించే పండ్లలో పనస పండు కూడా ఒకటి. పండిన పనస తొనలలో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇతర పండ్లతో పోలిస్తే విటమిన్లు, ఫొలేట్, నియాసిన్, పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉంటాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. అధికంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియ సక్రమంగా జరిగి మలబద్ధకాన్ని నిరోధిస్తుంది. అల్సర్, మధుమేహం, గుండెపోటు, రక్తపోటు మొదలైన సమస్యలు దూరమవుతాయి. ఈ పండులో వుండే సి విటమిన్ చర్మం, శిరోజాలను సంరక్షిస్తుంది.

వ్యాధి నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. కేన్సర్ నిరోధకాలుగా పని చేసే ఫైటో న్యూట్రియంట్స్ పనసలో పుష్కలంగా ఉంటాయి. కేన్సర్ సమస్యని దూరం చేస్తుంది. ఖనిజాలు, లవణాలు, థైరాయిడ్ గ్రంథి ఆరోగ్యాన్ని కాపాడతాయి. అధిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించటమే కాక బరువును అదుపులో ఉంచుతుంది.

ఇందులో వుండే విటమిన్ ఎ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఫుడ్ ఎలర్జీ ఉన్నవారు పనసపండును తినకపోవటం మంచిది. పచ్చి పనసతో చేసే బిర్యాని రుచిగా ఉంటుంది. పనసపండు గింజల్లో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి.



# సాహిత్యంలో తెలంగాణ పోరాటం

జయసూర్య

"అడవుల కొండల అనుంగు బిడ్డల
పొలాల పొత్తిట పెరిగిన పాపలు
లేచిరి క్రోధోద్ధత భీకరులై
సమరోద్వృత, కౌక్షేయక కరులై
తళతళ తళతళ మెరిసెను కొడవలి
ఎగసి ఎగసి నర్తించెను నాగలి
పుట్టకీటుతో కదిలి రాచరిక
అట్టాలికములు మట్టిని కలిసెను
బేర కుబేరుల మేడలు మిద్దెలు
గడగడ గడగడ వణుకుచు కూలెను
హాలాకూల జారుల పరిపాలన
పత్రెలు వారి బదాబదలయ్యెను"

భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఆఖరి ఘట్టం తెలంగాణ సాయుధ పోరాటం. హైదరాబాద్ సంస్థానం, స్వతంత్ర భారతావనిలో విలీనం కావటాన్ని త్వరితగతి చేసిన తెలంగాణ సాయుధ పోరాటం , 1946 జులై 4న సమర యోధుడు దొడ్డి కొమరయ్యపై వరంగల్ జిల్లా కడివెండి తుపాకుల కాల్పుల మరణంతో పెల్లుబికి దాదాపు అయిదేళ్లు కొనసాగింది.

1930-1950 రెండు దశాబ్దాలు తెలుగు సాహిత్యం స్వాతంత్ర్య పోరాటం, అనంతర దశాబ్ది చారిత్రక, సామాజిక పరిణామాలను వివిధ ప్రక్రియలుగా అందిపుచ్చుకొంది. భూమి, భుక్తి, విముక్తి, సోషలిజం, లక్ష్యంగా రాజకీయ మేధావి వర్గం సాయుధ పోరాటం ప్రజ్వలింపచేసిన ఆ దశాబ్దంలో తెలుగు రచయితలు, కవులు, కళాకారులు కలాలను ఆయుధాలుగా జన సామాన్యాన్ని ఉత్తేజం, విప్లవోన్ముఖం చేసారు.

ప్రబంధ పద్య కవితా కన్యక పరిష్వంగాన్ని సడలించుకొన్న ఆధునికాంధ్ర కవితా వధూటి భాషలో, భావంలో రూపంలో కొత్త పరవళ్లు తొక్కింది. ఆధునికత, వ్యవహార భాషా సంస్కరణలు కాలానుగుణంగా జీవం అందించడంతో ప్రౌఢ, జాణ లాలిత్యాన్ని పరిత్యజించి తెలుగుభాష, సాహిత్యం ధ్వని ప్రధానమైన శక్తితో నూతన యుగానికి మార్గం అనుసరించింది. క్రమేపీ పతితులు, భ్రష్టులు, బాధాసర్పదష్టులు, దీనులు, హీనులు ఎందరో హతాశులు వారి జీవితాలు కథా వస్తువులయ్యాయి. "ఎముకలు కుళ్లిన వయస్సు మళ్లిన సోమరులారా చావండి" అంటూ మహా ప్రస్థానానికి శ్రీశ్రీ పిలుపు యిచ్చారు.

యిక తిరుగుబాటుకు, విప్లవ సమర చైతన్యానికి తెలంగాణలోని నిజాం పాలనను ప్రతిఘటించే సాయుధ పోరాటాలకు, సాహిత్య ప్రక్రియలలో పాట ఆజ్యం పోసింది. ప్రపంచంలోనే గుర్తింపు పొందిన తెలంగాణ సాయుధ పోరాటం పాటకు పురుడు పోసింది. పెన్ను, గన్ను చేపట్టిన రచయితలు పాటను ప్రజాపోరాటాలకు దన్నుగా నిలబెట్టారు. కరపత్రాలు, పాటల బృందాలు, బుర్రకథ దళాలు, గొల్లసుద్దులు పోరాట సాహిత్యం వెల్లిరిసింది. జానపదానికి వన్నె తెచ్చిన ఉయ్యాలో పాటలు ఈటెలయ్యాయి. జాగీర్దారుల అకృత్యాలకు రైతాంగం సంఘటితమైంది. కమ్యూనిస్టు పార్టీ రగిలించిన విప్లవాగ్ని, సాయుధ పోరాటంలోని అయిదేళ్ల కాలంలో, తెలుగు పాట జనసామాన్యాన్ని ఉత్తేజవంతం చేసింది. పోరుయోధుల ఆత్మబలిదానాలు, తుపాకి కాల్పులలో మారణకాండలు, విముక్తి పోరాటాలు చరిత్ర సృష్టించాయి. ఆ నేపథ్యంలో తదనంతరం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనోద్యమం క్రమేపీ తర్వాత దశాబ్దాల కాలభ్రమణంలో ఊపిరి పోసుకొంది. ఎందరో అమర వీరుల ప్రాణత్యాగాల, సాహసిక కథనాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.



బానిసత్వాన్ని, నిరంకుశత్వాన్ని ప్రతిఘటించిన ప్రపంచ విప్లవోత్తేజ పోరాట చరిత్రలో, స్వేచ్ఛా స్వాతంత్ర్య సాధనా సమరాలలో ఏ దేశంలో అయినా సాహిత్యం ద్వారా కళాకారులు, రచయితలు వైతాళికులుగా చరిత్రాత్మక బాధ్యతలు నిర్వర్తిస్తారు.

"సుట్టు ముట్టూ సూర్యపేట
నట్టనడుమ నల్లగొండ
నువ్వుండేది హైదరాబాదు
దాని పక్క గోలుకొండ
గోలుకొండ ఖిల్లా కిందా
నీ గోరి కడతం"

తెలుగు సాహిత్యంలో అభ్యుదయం ప్రవేశించింది. అరసం ఆవిర్భవించింది. అంతర్జాతీయ రాజకీయ సిద్ధాంతాలు ముఖ్యంగా కమ్యూనిజం ప్రభావం మేధావంతులను దేశ స్వాతంత్ర్యానంతరం కదిలించింది. ఏ రాజకీయ విప్లవ సిద్ధాంతమైనా ఆ భావజాలానికి కవులు, రచయితలు కొందరైనా తీవ్రంగా ప్రేరేపితులు కావడం ప్రపంచ చరిత్రలో సహజ చారిత్రాత్మక పరిణామం. అదే తెలుగు సాహిత్యంలో కూడా నడుస్తున్న సామాజిక, రాజకీయ పాలనా వ్యవస్థను ఎదుర్కొనే పోరాట భావజాలంగా పరిణమించింది.

ప్రపంచ చరిత్రలో వీరోచిత ఉద్యమంగా పేర్కొనదగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రజా కళా రూపాలలో, సమరోత్సాహపు గేయ సాహిత్యం సృష్టించింది. ఒక చేత్తో పెన్ను, మరో చేత్తో గన్ను పట్టుకొన్న విప్లవకారులు ప్రజలను పోరాటాలకు ఆయత్తపరిచే సాహిత్యం నాటి సామాజిక, రాజకీయ, సాంస్కృతిక జీవనానికి ఆనవాళ్లుగా నిలిచింది. సాహిత్యానికి విప్లవోద్యమాలకు అవినాభావ సంబంధం వుందని తెలంగాణ సాయుధ పోరాటంలో జ్వలించిన కవిత్వం జన సామాన్య ఆకాంక్షలను అక్షరీకరించింది. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎరుపెక్కిన పాట తర్వాత దశాబ్దాలలో పరవళ్లు తొక్కే సామాజిక పోరాటాలలో కూడా అంతర్భాగమైంది.

"ఎర్రజెండా బిడ్డలు-పేద కనుపాపలు
పొడిసేటి పొద్దులు-పోరులో
నెలవంకలు"

చైతన్యవంతమైన పోరాట 'స్ఫూర్తి'తో కవి, గాయక కళాకారులెందరో తెలంగాణ సాహిత్యంలో నాడు అగ్నిశిఖలు రగిలించారు.

# గురుభక్తి

**యామిజాల జగదీశ్**

ఒకరోజు ఒక మిత్రుడు తన కొడుకుని నా దగ్గరకు తీసుకువచ్చాడు. వచ్చీ రావడంతోనే తన కొడుకు గురించి చెప్పడం మొదలుపెట్టారు. "సరిగ్గా చదవడని, పెద్దలను గౌరవించడని. నువ్వు కాస్త ఏదైనా నాలుగు మంచి మాటలు చెప్పి వాడిని దారిలోకి తీసుకువస్తే" బాగుంటుందన్నాడు.

మిత్రుడి మాటలతో నేను ఆలోచనలో పడ్డాను. ఎందుకంటే పెద్దలను గౌరవించని ఆ కుర్రాడు నన్నేం లెక్క చేస్తాడన్నదే నా అనుమానం. నాలో నన్ను నేను ప్రశ్నించుకుంటూంటే సరైన జవాబు రాకపోవడంతో మిత్రుడితో చెప్పేసాను "ఏమీ అనుకోకు.. నా వల్ల కుదరదని".

కానీ మిత్రుడు నన్ను వదల్లేదు. మంకుపట్టు పట్టాడు. "నువ్వలా అనడానికి వీల్లేదని. నువ్వేం చేస్తావో నాకు తెలీదు. నా కొడుకుని సరిదిద్దే బాధ్యత నీదేరా" అన్నాడు.

అతని పట్టుదల చూస్తుంటే కొడుకు బదులు అతనే శిష్యుడిగా నా దగ్గరకు రోజూ వస్తానన్నట్టుగా ఉంది. దాంతో మరో దారి లేక సరేనని ఒప్పుకున్నాను. మిత్రుడి కొడుకుని శిష్యుడిగా చేర్చుకున్నాను. గురుభక్తి అంటే ఎలా ఉండాలో చెప్పాను ఆ కుర్రాడికి.

అనగనగా ఓ గురువుగారుండేవారు. ఆయన దగ్గర ఒక శిష్యుడు ఉండేవాడు. ఆ శిష్యుడి పేరు తులసి చైతన్యుడు. నైష్టిక బ్రహ్మచారి. తన గురువుని విసిగించకుండా ఆయనకు ఏదవసరమో గ్రహించి అవన్నీ చేస్తూ ఉండేవాడు.

కానీ అతనిని చూస్తే మిగిలిన శిష్యులకు గిట్టేది కాదు. అతని మీద అసూయ కలిగింది. తమకన్నా అతను గురువుగారి దగ్గర మంచివాడనిపించుకుంటున్నాడని వారి గోలంతా. ఈ శిష్యులందరూ ఒకరోజు కట్ట కట్టుకుని గురువు గారి దగ్గరకు వెళ్లి చైతన్యుడి గురించి ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పి చెడ్డ పేరు తీసుకురావాలని ప్రయత్నించారు. వాడు సరైనవాడు కాదని చెప్పారు.

అయితే గురువుగారు వారి మాటలను నమ్మలేదు. ఆయనకు తెలీదా.. ఎవరు ఎలాంటి వారోనని. కనుక వారు చెప్పిన మాటలను సీరియస్‌గా తీసుకోలేదు.

చైతన్యుడి గురించి వారికి చెప్పాలనుకున్నారు గురువుగారు. అందుకోసం ఆయన ఓ ఆలోచన చేశారు. ఒరోజు శిష్యులందరితో కలిసి ఓ అడవి మార్గంలో పోతున్నారు. మార్గమధ్యంలో ఓ లోయ కనిపించింది. ఆ లోయను చూపిస్తూ ఇందులోకి మీలో ఎవరు దూకుతారని అడిగారు గురువుగారు.

శిష్యులెవరూ ముందుకు రాలేదు. అయితే ఓ చిన్న మూటతో వచ్చిన చైతన్యుడి వంక చూసారు గురువుగారు.

నువ్వీ లోయలోకి దూకుతావా? అని అడిగారు గురువుగారు చైతన్యుడితో.

గురువుగారు అలా అన్నారో లేదో చైతన్యుడు దూకేశాడు.

అయితే గురువుగారు తన యోగశక్తితో దూకి చైతన్యుడికి ఏ ప్రమాదమూ జరక్కుండా పట్టుకుని వెనక్కు తీసుకువచ్చారు.

మిగిలిన శిష్యులు ఈ సంఘటనను చూసి విస్తుపోయారు. ఒక్క క్షణం వారిలో మాటలు లేవు. చైతన్యుడి ధీరత్వాన్ని చూసిన తోటి శిష్యుల నోటంట మాట లేదు. గురువుగారి వంకా, చైతన్యుడి వంకా అయోమయంగా చూశారు. అనంతరం అక్కడి నుంచి గురువుగారు అందరితో కలిసి ఆశ్రమానికి వచ్చేశారు.

ఒరోజు గురువు గారికి వక్కలు చైతన్యుడు కొట్టిచ్చే చిన్నపాటి రోటినీ, రోకలినీ మిగిలిన శిష్యులు దాచేశారు.



గురువుగారికి దంతాలు లేవు. కనుక ఆయనకు వక్కలు దంచివ్వడం చైతన్యుడి వంతు. ఈ రోజు చైతన్యుడు ఏం చేస్తాడోనని అనుకున్నారు. ఈ విషయం తెలియని గురువుగారు చైతన్యుడిని పిలిచి వక్కలు దంచివ్వమని అడిగారు. సరేనన్న చైతన్యుడికి వక్కలు కొడదామంటే రోలు, రోకలి కనిపించలేదు. ఏం చేయాలా? అని ఆలోచించాడు.

గురువు గారికి సేవ చేయడం తన వంతు అనుకున్న చైతన్యుడు ఏం చేసాడో తెలుసా? వక్కలను తన నోట్లో వేసుకుని కొరికి గురువు గారికి ఇచ్చాడు. పుస్తకం చదువుతున్న ధ్యాసలో ఉన్న గురువుగారు చైతన్యుడు దంచి ఇచ్చిన వక్కపలుకులను నోట్లో వేసేసుకున్నాడు.

గురువుగారు చైతన్యుడితో రోజూ కంటే ఈ రోజు తమలపాకులు, వక్కపొడి చాలా బాగుందన్నారు. ఎంతో రుచిగా ఉందన్నారు. వక్కలు నువ్వు దేనితో దంచావో చూడాలని ఉందన్నారు గురువుగారు. నువ్వు రానక్కర్లేదు, వాటిని పంపిస్తే చాలన్నారు గురువుగారు.

గురువుగారి కోరికతో చైతన్యుడు కంగుతిన్నారు. ఏం చేయాలా? అని సందిగ్ధంలో పడ్డారు.

చైతన్యుడు ఏమాత్రం ఆలోచించకుండా కత్తి తీసుకుని తన తలను నరుక్కున్నాడు. దానిని మరొకరికి ఇచ్చి దాన్ని గురువుగారి దగ్గరకు పంపాడు. గురువు గారు ఆ తలను చూసి విస్తుపోయారు. జరిగినదంతా తెలుసుకున్నారు. ఆయన తన యోగశక్తితో చైతన్యుడికి ఊపిరి పోశారు. అతని గురుభక్తి ఏపాటితో అర్థం చేసుకోండని మిగిలిన శిష్యులతో చెప్పారు. రోలు, రోకలి చూడాలని అడిగితే అతను తన తలను నరికి నాకు చూపడం ఆశ్చర్యమని అన్నారు గురువుగారు.

"ఎందుకని నువ్వు నీ తలను నరుక్కున్నావని?" అడిగారు గురువుగారు.

చైతన్యుడు జరిగినదంతా చెప్పి తనను మన్నించమని గురువుగారి పాదాలపై పడ్డారు.

చైతన్యుడి గురుభక్తి అక్కడున్న అందరినీ తల దించుకునేలా చేసింది. తమ తప్పు తెలుసుకున్నారు.

చలపాక ప్రకాష్

# బాధ్యత



ఆ రోజు ఆ కుటుంబం ఎంతో సంతోషంగా ఉంది. దానికి కారణం.. వాళ్లు కలలుగన్న సొంతింటి కల నెరవేరిన రోజది. ఆ రోజే గృహ ప్రవేశం చేసి వేడుక చేసుకున్నారు వాళ్లు.

సాయంత్రమైంది. ఆ ఆనందంలో ఆ ఇంటి పెద్దయిన సంజయ్‌కి ఎందుకో గుడికి వెళ్లాలనిపించింది. అనుకున్నదే తడవుగా తన కుటుంబ సభ్యులందరితో గుడికి ప్రయాణమయ్యాడు. ఎందుకోగాని గుడులన్నీ కొండపైనే ఉంటాయి. బహుశా కిందుంటే దొంగల బారి నుండి రక్షణ ఉండదనేమో! ఎలాగైతేనేం కొండ పైనున్న గుడికి కాలినడకతో వెళ్లారు ఆ కుటుంబమంతా. మనసుకు హాయిగా ఉంది వాళ్లకి. బహుశా, ఆనందంతో కూడిన మనస్సు ప్రశాంతత వల్లనుకుంటా!

"డాడీ! ఈ పుస్తకం కొనుక్కుంటా!" అంది సంజయ్ పెద్దకూతురు సంధ్య అక్కడ ఉన్న పుస్తక విక్రయశాలలో చూస్తూ.

"ఏం పుస్తకమంది?" అడిగింది సంజయ్ భార్య శ్రీలేఖ.

"రామకోటి"

"రామకోటి పుస్తకమా! నీ వయస్సు పిల్లలకి అవి ఎందుకు? పెద్ద వయస్సు వాళ్లు రాసేవి అవి!" అంది శ్రీలేఖ కూతుర్ని ఉద్దేశించి.

"నేను రాస్తానమ్మా రామకోటి" అంది సంధ్య భక్తిగా.

"అలాగే అంటావు. సగంలో రాసి మానేస్తే..." మధ్యలో సంజయ్ అందుకుని అన్నాడు.

"పిల్లల్ని ఎంకరేజ్ చెయ్యాల్సిందిపోయి అలా డిజప్పాయింట్ చేస్తారేమిటండీ మీరు? అలాగంటే పిల్లల్లో భక్తిభావం ఎలా పెరుగుతుంది?" శ్రీలేఖ కోపంగా అంది సంజయ్‌ను ఉద్దేశించి.

"నేను అన్నదాంట్లో తప్పేముంది? అది చదువు డిగ్రీ సగంలోనే మానేసింది. హిందీ నేర్చుకుంటానంటే పంపాను. అదీ మాధ్యమికలోనే ఆపేసింది. సంగీతం నేర్చుకుంటానంటే సంగీతం నేర్పే క్లాసులకి ఫీజు కూడా కట్టాను. వారంలోపే ఎగ్గొట్టేసింది. ఏదీ పూర్తి చేసిన పాపాన పోలేదు. మరి ఈ రామకోటి రాయాలంటే మాటలా? చేతులు నొప్పని మధ్యలోనే మానేస్తే?" క్లాసు తీసుకున్నాడు సంజయ్.

"మీరన్నీ ఇలాగే మాట్లాడతారు.. ముందు ఆ పుస్తకం ఏదో కొనివ్వండి. దానిచేత నేను దగ్గరుండి మరీ రోజూ రాయిస్తా" అంది శ్రీలేఖ.

"అవును డాడీ! అమ్మ అన్నట్లు ఉదయాన్నే నిద్ర లేచి, వచ్చే నవమినాటికి పూర్తి చేయకపోతే అప్పుడడగండి" అంది పెద్ద ఆరిందానిలాగా సంధ్య.

అంత కచ్చితంగా రాస్తానని అమ్మాయి చెబుతుంటే ఇక తప్పదన్నట్లు సంజయ్ రామకోటి పుస్తకం కొనిచ్చాడు.

మర్నాడు సంధ్య ఉదయాన్నే లేచి స్నానం చెయ్యడం ఆలస్యం రామకోటి రాయడం మొదలుపెట్టింది. అలా రెండు రోజులు ఆమె రామకోటి రాస్తూ తండ్రి కంట కనబడింది. మూడో రోజు అదే సమయానికి కూతురు రామకోటి రాస్తూ కనబడకపోయేసరికి సంజయ్ అడిగాడు భార్యని "సంధ్య ఏదీ?" అని.

"ఇంకా నిద్ర లేవలేదు" భార్య శ్రీలేఖ సమాధానం.

"ఇంకా లేవకపోవడమేమిటి? రోజూ ఇదే సమయానికి రామకోటి రాస్తూ కనిపించేది కదా!" అనుమానంగా అడిగాడు ఇది మూడ్నాళ్ల ముచ్చటేనా అన్న ధోరణిలో.

"మీరెందుకు అలా అనుమానంగా చూస్తారు? ఈ రోజేదో బడలిక వల్ల లెగలేదు. రేపటి నుండి రాస్తుందిలే" అంది శ్రీలేఖ కూతుర్ని వెనకేసుకు వస్తూ.

నాలుగు, ఐదు, ఆరు రోజులైనా సంధ్య మళ్లీ ఆ రామకోటి ముట్టుకుంటే ఒట్టు.

అదే అడిగాడు కోపంగా సంజయ్.

"రెండ్రోజులు రాసేసరికే దాని చేతులు నొప్పెట్టి బొబ్బలెక్కిపోయాయండి. మరో రెండు రోజుల తర్వాత నొప్పులు తగ్గాక రాస్తుంది లెండి" అంది శ్రీలేఖ.

అలా రెండు రోజులన్నది వారం, రెండు వారాలైనా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు రామకోటి అక్కడే పడి ఉంది. కొన్ని రోజుల తర్వాత ఏదో పుస్తకం కోసం వెతుకుతున్న సంజయ్‌కి మూల పడవేసి వున్న 'రామకోటి' పుస్తకం కనిపించింది. అంతే! అతని కోపం తారాస్థాయికి వెళ్లింది. కూతుర్ని పిలిచి కోపంగా అరిచాడు. భార్య మీదా చిందులేసాడు.. అసంపూర్ణంగా పడి వున్న రామకోటిని చూసి.

"మీవన్నీ అసంపూర్ణమైన మాటలు, అసంపూర్ణమైన చేష్టలే" అంటూ కోపంతో ఊగిపోయాడు.

దానికి శ్రీలేఖ "చిన్నదానికే ఎందుకంత అరిచి గీపెడతారు? చిన్న పిల్ల. అది రాయలేకపోయింది. నేను రాస్తాలెండి" అంది భార్య శ్రీలేఖ.

కూతురు చెయ్యలేని పని భార్య పూర్తి చేస్తానన్నందుకు కొంతలో కొంత శాంతపడ్డాడు సంజయ్.

రెండు రోజులు శ్రీలేఖ కూడా రామకోటి రాస్తూ కనిపించింది. ఆ తర్వాత.. కూతురి బాటలోనే ఆవిడ కూడా. సంజయ్‌కి కోపం చిర్రెత్తుకొచ్చింది. అదే సమయంలో కూతురికి పెళ్లి సంబంధం రావడం, పెళ్లి చేసెయ్యడం, కూతురుకి కొడుకు పుట్టి మనవడ్ని ఎత్తుకోవడం... అన్నీ కాలగమనంలో సినిమా రీళ్లలాగా తిరిగిపోయాయి. కానీ రామకోటి మాత్రం ఎక్కడ వున్నది అక్కడే అలా పదిలంగా ఉండిపోయింది.

కొద్దిరోజుల తర్వాత ఒకరోజు..ఆఫీసు ఫైల్స్ వెతుకుతున్న అతనికి అసంపూర్ణంగా ఉన్న రామకోటి పుస్తకం కనిపించింది... అంతే! గతం గుర్తుకు వచ్చి "మాటలు కోటలు దాటవన్నట్లు' తన కూతురి మాటలు, చేష్టలు గుర్తుకు తెచ్చుకొని నొచ్చుకున్నాడు.

సాధారణంగా పెద్దలు పూర్తి చెయ్యలేని పనులు పిల్లలు చేస్తుంటారు. కానీ ఇక్కడ తనవాళ్లు అసంపూర్తిగా వదిలేసిన రామకోటిని తనన్నా పూర్తి చేసి కుటుంబ పెద్దగా తాను ఆ బాధ్యతను నిర్వర్తించాలని నిశ్చయించుకున్నాడు సంజయ్ పట్టుదలగా. ✦

# అత్యధిక వేడి ప్రదేశం 'దల్లోల్'

షేక్ అబ్దుల్ హాకీం జాని

ఈ భూగోళంలో అనేక అద్భుతాలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఆఫ్రికాలోని ఇథియోపియా దేశానికి చెందిన అఫార్ ట్రయాంగిల్ ప్రాంతంలోని దల్లోల్. ఈ ప్రదేశం ఒక మిస్టరీ. వందలాది సంవత్సరాలుగా ఇక్కడి భూభాగంలో జరుగుతున్న మార్పులను గుర్తించి ఈ ప్రదేశానికి దానకిల్ డిప్రెషన్ అని నామకరణం చేశారు. ఇది ప్రపంచంలో అత్యధిక వేడి ప్రదేశంగా నమోదైంది. దీనికి అనేక కారణాలున్నాయి. 'నరకానికి ద్వారం'గా పేర్కొంటున్న ఈ ప్రదేశాన్ని సాహస పర్యాటకులు మాత్రమే వెళ్లి తిలకిస్తుంటారు.

ప్రపంచంలో ఎక్కడా కానరాని భౌగోళిక వింతలను దల్లోల్ ప్రాంతంలో చూడవచ్చు. ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రాంతాలు సముద్ర మట్టానికి ఎగువన ఉంటాయి. అయితే ఇథియోపియాలోని దల్లోల్ ప్రాంతం సముద్ర మట్టానికి 125 మీటర్ల దిగువన ఉండటం విశేషం. డెడ్‌సీ ప్రాంతం ఇంతకంటే దిగువన ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. డెడ్‌సీ సముద్ర మట్టానికి 400 మీటర్ల దిగువన ఉంటుంది. ప్రపంచంలో చురుకుగా ఉండే అగ్ని పర్వతాలు



అయిదు ఉంటే అందులో ఒకటి దల్లోల్ ప్రాంతంలో ఉంది. దీని పేరు ఎర్తాలే బసాల్టిక్. ఇది ప్రసిద్ధి చెందిన అగ్ని పర్వతం. 1926లో ఈ అగ్ని పర్వతం విస్ఫోటనం చెందిందని ఇక్కడి చరిత్ర చెబుతుంది. ఆ తరువాత కూడా చిన్న చిన్న విస్ఫోటనాలు జరిగినట్లు తెలుస్తుంది. ఇక్కడ విశాలమైన ప్రదేశంలో పలు రంగాల్లో అతి పెద్ద బండరాళ్లు, సెగలతో పొగలు



కక్కే వేడినీటి బుగ్గలు, ఉప్పుకొండలు, పొటాషియం సల్ఫర్ ఇత్యాది ఖనిజాలు మిళితమైన రాళ్లు ఉన్నాయి. నిమ్మ, నారింజ, పసుపు, నీలం, ఆకుపచ్చ, ఎరుపు.. ఇలా అన్ని రంగుల్లో ఇక్కడ రాళ్లతో పాటు వేడినీటి బుగ్గలు.. ఇలా పలు రూపాలలో కనిపించడం చూస్తుంటే ఇంద్రధనస్సు నేలను ఆక్రమించుకుందా? అనే భావన కలుగుతుంది.


ఇక్కడ ఎరుపు, ఆకుపచ్చ, కాషాయ వర్ణంలో వేలాది రాళ్లు ఉన్నాయి. ఎరుపు రంగు రాళ్లల్లో ఇనుము ఉంటుంది. పసుపు వర్ణం రాళ్లలో సల్ఫర్, ఆకుపచ్చ రంగు రాళ్లలో సోడియం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మూడు పదార్థాలు ప్రకృతి సిద్ధంగా ఇక్కడ కలవడంతో సల్ఫ్యూరిక్ ఆసిడ్ తయారౌతుంది. దాంతో అనేక ఆమ్ల కొలనులు ఇక్కడ ఏర్పడ్డాయి. ఇటువంటి చర్య ప్రపంచంలో ఒక్క దల్లోల్‌లోనే జరుగుతుంది. అందువల్ల ఈ ప్రాంతంలో కఠినమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడి రాళ్లల్లో నిక్షిప్తమైన ఖనిజాల వల్ల, వేడి నీటి బుగ్గల వల్ల జరిగిన రసాయనిక చర్యల కారణంగా ఈ ప్రాంతమంతా దుర్గంధ భరితంగా తయారైంది. ఈ దుర్వాసనను తట్టుకోలేక తిలకించడానికి వెళ్లిన ప్రతి ఒక్కరూ ప్రత్యేకమైన మాస్కులు ధరిస్తారు. కొందరైతే ఊపిరి ఆడక వాంతులు చేసుకుంటారు. చెడు వాసన వల్ల ఊపిరి ఆడని సందర్భాలు కూడా ఉంటాయి. అందుకే ఈ ప్రదేశాన్ని 'నరకానికి ద్వారం'గా పేర్కొన్నారు. ప్రత్యేకమైన చెప్పులు, బూట్లు లేకుండా ఈ ప్రదేశంలో నడవరాదు. రంగునీళ్లు కనిపించాయని అందులో కాళ్లు పెట్టరాదు. అలా చేస్తే కాళ్లు కాలిపోతాయి. గైడ్ల సహకారంతోనే ఈ ప్రాంతంలో జాగ్రత్తగా నడవాలి. అన్ని రకాల కెమికల్స్ ఇక్కడి నీళ్లలో మిళితమై ఉన్నాయి. ద్రవ రూపంలో ఇంత భయానక రసాయనాలు పంచ రంగులతో కనిపిస్తూ నయనానందం చేసినప్పటికీ ఇవి చాలా ప్రమాదభరితంతో కూడుకున్నాయి. ఇంద్రధనస్సు నేలను ఆక్రమించుకుందా? అనే సందేహం వస్తుంది. ఈ ప్రకృతిని ఆస్వాదించడానికి పర్యాటకుడు ఖగోళ శాస్త్రవేత్త కానక్కరలేదు. ప్రకృతి ఆరాధకుడైతే చాలు. రసాయనాలు కలిపిన ద్రవాలు, రాళ్ల వల్ల విపరీతమైన వేడి ఉత్పన్నం కావడంతో ఎక్కువసేపు ఈ ప్రాంతంలో ఉండి ప్రకృతి దృశ్యాలను ఆస్వాదించలేం.

ముఖాలు మాడిపోయినట్లు అనిపిస్తుంది. ఈ ప్రదేశంలో ఒకప్పుడు కర్మాగారాలు, చిన్న చిన్న గ్రామాలు ఉండేవి. ఈ దుర్వాసన భరించలేక అందరూ ఖాళీ చేసి దూర ప్రాంతాలకు వెళ్లిపోయారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే చూడటానికి వెళ్లినవారు రోగాల బారిన పడతారు. ఈ ప్రాంతాన్ని చూసినప్పుడు మనం ఎన్నడూ చూడని మరో వింత ప్రపంచంలోకి వెళతాం. ఇక్కడి అగ్నిపర్వతం చుట్టూ వేడినీటి బుగ్గలు కనిపిస్తాయి. ఇవి పలు రకాల వాయువులను విడుదల చేయడంతో ఈ ప్రదేశమంతా విపరీతమైన వేడిగా మారిపోతుంది. విషపూరిత వ్యర్థాలు, రసాయనాలతో ఈ ప్రదేశం నిండి ఉంటుంది. ఇక్కడి వింతలను చూడటానికి, సాహసోపేత యాత్రలో భాగంగా అనునిత్యం ప్రపంచ పర్యాటనకు వస్తూనే ఉంటారు. దల్లోల్‌లో వర్షపాతం అతి తక్కువగా ఉంటుంది.

బ్రిటిషు అన్వేషకుడు విల్‌ఫ్రెడ్ థెసిగర్ ఈ ప్రదేశాన్ని సందర్శించి దీన్ని 'మృత్యుభూమి' అని పిలిచాడు. నేషనల్ జియోగ్రఫీ ఈ ప్రదేశాన్ని భూమిపై అత్యంత క్రూరమైన ప్రదేశంగా నామకరణం చేసింది. ఎడారి ప్రాంతంలోని ఈ భయానక అందాలను హెలీకాప్టర్‌లో విహంగ వీక్షణం చేస్తూ తిలకించవచ్చు. భౌగోళిక పరిశోధనలు చేయాలనుకునే వారికి ఇదో అధ్యయనం కేంద్రం అని చెప్పవచ్చు.

ఈ ప్రదేశాన్ని తిలకించేటప్పుడు లీటర్ వాటర్ ఇస్తారు. ఈ ప్రాంతాన్ని మూడు గంటల్లో తిరిగి తిరిగి వచ్చేంతవరకు ఈ నీళ్ల తాగుతూనే ఉండాలి. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల అతిగా దాహం వేస్తుంది. అలా నీళ్ల తాగకపోతే దాహం వేసి ప్రాణాపాయం కలగవచ్చు. ఈ ప్రదేశాన్ని తిలకించాలంటే ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. ఆ సమయంలో 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. ఇది ఇక్కడ అతి కనిష్ఠ ఉష్ణోగ్రత. సూర్యుడు నడినెత్తికి వచ్చినప్పుడు ఈ ఉష్ణోగ్రత 60 నుండి 65 డిగ్రీల సెల్సియస్‌కు పెరుగుతుంది. ఇది గరిష్ఠ ఉష్ణోగ్రత. ఈ ప్రదేశాన్ని ఎర్ర సముద్రంలో భాగంగా చెబుతున్నారు.

దాదాపు లక్షల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతం సముద్రంగా ఉండేది. ప్రమాదకరమైన ఖనిజాలు మిళితమైన, నీరు ఇంకిపోయి, ఆవిరై రాళ్లకు నిలయంగా మారిపోయింది. 30 వేల సంవత్సరాల క్రితం అగ్నిపర్వతం విస్ఫోటం చెందడం వల్ల కూడా సముద్రపు నీరు ఆవిరవడం, ఇంకిపోవడం జరిగిందని చెబుతుంటారు. దల్లోల్ పక్కనే మరోవైపు ఉప్పుకొండలు కానవస్తాయి. వర్షాలు పడినప్పుడు ఉప్పు కొండల మధ్య నుండి నదులు ప్రవహిస్తాయి. ఈ కొండలు ఒక మట్టి పొర, దానిపై ఉప్పు పొర ఇలా... పొరలు పొరలు మిళితమై అతి పెద్ద



కొండలుగా ఏర్పడ్డాయి. వాతావరణంలో జరిగే మార్పుల వల్ల ఈ ఉప్పుకొండలు పెళ్లలుగా విరిగిపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల వీటి పక్కన నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఈ ఉప్పు తినడానికి పనికిరాదు. సమీపంలో ఉన్న ఒక సరస్సులో ఉన్న నీటి నుండి ప్రకృతి సిద్ధంగా ఉప్పురాళ్లు, పలకలు తయారౌతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ప్రాంతంలో ఉప్పు ఎడారిని చూడవచ్చు. ఈ ఉప్పును తినడానికి ఉపయోగిస్తారు. సాధారణంగా ఒక లీటర్ ఉప్పు నీటిలో 11 శాతం వరకు ఉప్పు శాతం ఉంటుంది. అయితే ఇథియోపియాలోని దల్లోల్ సరస్సులోని లీటర్ నీటిలో 45 శాతం ఉప్పు ఉంటుంది. అంటే ఒక లీటర్ నీటి నుండి 450 గ్రాముల ఉప్పు లభిస్తుంది. ప్రపంచంలో ఇంత ఉప్పు శాతం ఉన్న నీరు ఎక్కడా కనిపించవు అంటే అతిశయోక్తి కాదు. దల్లోల్ ప్రాంతంలో ఉప్పు నిక్షేపాలు 2 కి.మీ. మేర లోతులో భూమినందున్నాయి. అందువల్ల ఉప్పు మైనింగ్ పరిశ్రమ అభివృద్ధి చెందింది. మన ప్రాంతంలో నాపరాళ్లు, గ్రానైట్ రాళ్ళు భూమి నుండి వెలికి తీసినట్లు దల్లోల్ ప్రాంత వాసులు ఇక్కడ బండరాళ్లుగా మారిన ఉప్పును పగులగొట్టి, పలకలుగా చేసి, ఒంటెలపై పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ఈ సరస్సులోని నీరు చాలా వేడిగా ఉంటాయి. ఈ నీటిలో చేయి పెడితే మంట పుడుతుంది. స్థానికులకు చర్మంపై ఏదైనా ఫంగస్ వస్తే ఈ నీటితో దాన్ని కడగడం వల్ల ఫంగస్ తొలగిపోయి మేలు కలుగుతుందని విశ్వసిస్తారు. దల్లోల్ ప్రాంతంలో తయారయ్యే ఉప్పు పలకలను 'తెల్ల బంగారం' అని పిలుస్తారు. చాలా సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో ఉప్పును కరెన్సీగా ఉపయోగించారు. ఇక్కడ ఉప్పుగనులు 60 వేల చదరపు కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి. ఉప్పు వ్యాపారం చేసే మైనింగ్ అధికారికంగా 750 వరకు ఉన్నాయి. ప్రతీ ఏడాది 1.3 మిలియన్ టన్నుల ఉప్పు ఇక్కడ ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రదేశంలో ఉప్పు తవ్వడం చాలా కష్టమైన ప్రక్రియ. భూమి నుండి ఉప్పు పలకలను విచ్ఛిన్నం చేసి ఆ తరువాత గొడ్డలిని ఉపయోగించి వాటిని ముక్కలుగా చేస్తారు. ఈ విధంగా చేసిన నాలుగు కిలోల ముక్కను గన్‌ఫర్ అని పిలుస్తారు. గాడిదలు, ఒంటెలపై ఈ ఉప్పును వాణిజ్య పట్టణమైన బెరాహిలేకు రవాణా చేస్తారు. దల్లోల్ నుండి ఆ పట్టణానికి చేరడానికి మూడు రోజులు పడుతుంది. ఇలా ఉప్పును సేకరిస్తున్నందుకు, రవాణా చేయడానికి ముందు ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. ఉప్పును సేకరించేవారు సూర్యోదయానికి ముందే మైనింగ్‌కు చేరుకుంటారు. సూర్యుడు ఉదయించిన తరువాత ఎండ పెరిగేకొద్దీ ఈ ప్రాంతంలో వేడి పెరిగిపోయి ఎవరూ పని చేయలేరు. కనీసం నిలబడటం కూడా కష్టమవుతుంది. ఉప్పుకు డిమాండ్ పెరగడంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడా ఉప్పును సేకరిస్తున్నారు. వ్యాపారం పెరగడంతో ట్రక్కుల్లో ఉప్పును రవాణా చేస్తున్నారు. ఇన్ని వింతలు, విశేషాలతో దల్లోల్ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ■

# పరుల మాటలు

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

కొన్ని సందర్భాల్లో పరుల మాటలు మనసు నొప్పిస్తాయి. అది ఒక పెద్ద సమస్యగా మారుతుంది. ఒక్కోసారి ఆ మాయలో పడి, అర్థం గాకుండా వుండిపోతారు. మరి ఆ మాయలో పడకుండా వుండాలంటే ఏం చేయాలి?

ఒక ఊళ్లో ఒక వైష్ణవ దేవాలయం వుంది. ఆ దేవాలయంలో అన్ని సేవా కార్యక్రమాలు ఎంతో భక్తితో జరుగుతూ వుంటాయి. ఆ దేవాలయంవారు ఒక ఏనుగును స్వామి ఊరేగింపు కోసం వినియోగించేవారు. ప్రతిరోజూ ఆ ఏనుగు శుభ్రంగా స్నానమాచరించి రోడ్డు పక్కగా నడుచుకుంటూ వస్తుండేది. రోజూ దానికి ఎదురుగా ఒక పంది వస్తుండేది. ఆ పంది బురదలో పొర్లి పొర్లి వస్తుండేది. అయితే అది తన తోకను ఆడిస్తూ వచ్చే పోయేవారి మీద బురద పడేలా నడుస్తూ వచ్చేది. ఏనుగు ఆ పందిని చూసి దూర దూరంగా నడుచుకుంటూ వెళ్లేది. ఇలా పక్కకు వెళ్లడం మరో పంది గమనించి, ఎందుకలా ఆ ఏనుగు నిన్ను చూసి పక్క పక్కకు వెళ్తోంది అని అడిగింది బురదపందిని. బురదపంది ఒక్కసారి ఆగి, గర్వంగా చూస్తూ "చూసావా నా తడాఖా మరి. అంత పెద్ద ఏనుగు నాకు భయపడి పక్కకు తప్పుకుంటోంది" అంది. ఇలా తన గొప్పతనంగా అందరికీ చెప్తూ వుండేది.

అయితే ఒక రోజు ఒక పిల్లఏనుగు దాని మాటలు వినడం జరిగింది. దానికి కించిత్ ఆశ్చర్యం వేసింది. వెంటనే ఊరేగింపు ఏనుగు వద్దకు వెళ్లి అడిగింది. "ఆ పందిని చూసి నువ్వు నిజంగానే భయపడుతున్నావా?" అని.

అప్పుడు గుడికి వెళ్తున్న ఆ ఏనుగు "నా కాలితో నొక్కితే ఆ పంది నుజ్జు నుజ్జు అవుతుంది. దానికి నేను భయపడటం ఏమిటి? నాకు భయమా? భలేదానివి. అయితే నేను పక్కకు వచ్చింది దాని మీద వున్న బురద నా మీద పడకుండా వుండటానికే. నా మీద పడితే నేను అశుద్ధం అవుతాను. ఎంతో భక్తి శ్రద్ధలతో స్వామివారిని సేవించుకోడానికి వెళ్తున్న నాకు దాని గురించి ఎందుకు. నా స్వామి సేవకు నేను శుచిగా వెళ్లాలి. ఆ పనే నాకు ముఖ్యం. అంతేగానీ ఈ బురద పంది గురించి నాకెందుకు?" అని ఠీవిగా నడుచుకుంటూ నేరుగాఆలయంలోకి వెళ్లిపోయింది.

అలాగే మనకు మన ధర్మం, మన కర్తవ్యం ఏమిటో తెలిస్తే చాలు. మన ధర్మం మనం నెరవేర్చాలి. మన సేవ ఆయనకు నచ్చితే చాలు. అదే ముఖ్యం.

## భగవంతుని చూడాలంటే?

"భగవంతుడు అసలు ఉన్నాడా? సరే... వున్నాడనుకుంటే ఆయనను దర్శించుకోవాలంటే రోజూ ఎంత సమయం పూజ చేయాలి, ఎన్ని రోజులు చేయాలి, ఎన్ని నెలలు చేయాలి, ఎన్ని సంవత్సరాలు చేయాలి, ఏయే మంత్రాలు చదవాలి, ఎంత సాధన చేయాలి.. అన్న సందేహం ఎందరిలోనో ప్రశ్నగా తలెత్తవచ్చు. మరికొంత మంది "దేవుడు ఉంటే చూపించండి. దానికోసం మీరు చెప్పినంత సాధన చేస్తాను, చూపించగలరా? అంటూ ప్రశ్నిస్తారు.



ఒకసారి వివేకానంద స్వామివారు తన గురువు శ్రీరామకృష్ణ పరమహంసను 'దేవుడున్నాడా?' అని అడిగాడట. దానికి పరమహంసగారు 'దేవుడు ఉన్నాడు?' అని సమాధానం ఇచ్చారట. కానీ వివేకానందులవారికి సంతృప్తి కలగలేదు. "మీరు చూశారా?" అంటూ మరొక మొండి ప్రశ్న వేశారు. అప్పుడూ రామకృష్ణ పరమహంస చిరునవ్వుతో "దేముణ్ణి చూశాను, చూస్తున్నాను, నిన్నెలా చూస్తున్నానో ఆయనను కూడా అలాగే చూస్తున్నాను" అన్నారట. దానికి వివేకానందులవారు మరి నేను చూడాలంటే ఏమి చేయాలి? అని అడిగారు గురుదేవులను.

గురుదేవులు వెంటనే వివేకానందుని మెడపట్టి పక్కనున్న నీటితొట్లో ముంచి, ఒక్క నిమిషం పాటు గిలగిలా కొట్టుకున్న తర్వాత వదిలిపెట్టారట. తర్వాత గురుదేవులు ప్రశాంతంగా వివేకానందుని వైపు చూస్తూ, ఇప్పుడు నీకు ఏమనిపించింది? అంటూ అడిగారట.

"గురుదేవా, మీరు నీటి తొట్టిలో నన్ను ముంచినప్పుడు ఇంకొక్క క్షణం గాలి లేకుంటే నేను బతకలేనని భయం వేసింది. శ్వాస తప్ప ఇంకేమీ అవసరం లేదనిపించింది" అన్నారట వివేకానందుడు.

దానికి గురుదేవులవారు ఇలా వివరించారు... శ్వాసం కోసం నువ్వు ఆ క్షణం పడిన అదే ఆరాటం నీలో కలిగి, స్వామీ, నీవు లేకుంటే నేను బతకలేనని ఆర్తితో కలిగిన మరుక్షణం ఆయన దర్శనమవుతుంది" అన్నారట రామకృష్ణ పరమహంస. అంటే భగవద్దర్శనం కోసం ఎంతో సాధన చేయాలన్నమాట. మనం ఒక కొబ్బరికాయ కొట్టి వెంటనే కనపడాలనుకుంటే ఎలా? "స్వామీ, నేను ఐదు గంటల పాటు నిన్ను తప్ప మరొకటి తలపకుండా ధ్యానిస్తున్నాను. మిగతా సమయాల్లో నా బుద్ధి పలు విషయాల మీద అలా అలా తిరిగి చెత్త విషయాల పైకి మరలుతోంది. మీకు ఎలా కనపడుతున్నాడు?" అంటూ మరోసారి ప్రశ్నించగా-

స్వామి "నాయనా, నీకు భగవద్దర్శనం కావాలంటే ప్రతి క్షణం ఆయన యందే నీ మనస్సు లగ్నమై వుండాలి. నువ్వు భౌతికంగా ఏ పనిలో వున్నా నీ చిత్తమంతా అతని స్మరణలోనే వుండాలి. అప్పుడే ఆ జగద్రక్షకుడు నీతోనే వున్న భావన ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. సాధన సమయం అనిగాక, నీకు లభించిన ప్రతి క్షణాన్ని ఆయన భిక్షే అనే విషయాన్ని నీ మనస్సు అంగీకరించాలి. ఆ మరుక్షణమే నీవు పూజ, ధ్యానం, చేయనక్కరలేకుండానే దర్శన భాగ్యం లభిస్తుంది" అని స్వామి రామకృష్ణ పరమహంసవారు సెలవిచ్చారు.

ఆ విధంగానే వివేకానంద స్వామివారు తర్వాత తమ ప్రయత్నాలు సాగించారు.

వివేకానందుల వారు ఒక సందర్భంలో "నీ పూజలూ, జపాలూ.. అవీ ఇవీ భగవంతుని దర్శింపజేయ చాలవు, కేవలం ఆయన కరుణ తప్ప. చేసేది ఏ పనైనా బుద్ధిగా, సక్రమంగా చేస్తూ వుంటే మన మనస్సు పవిత్రమై ఆయనను వదలి వుండలేని ఆర్తి మనలో కలుగుతుంది. భగవంతుడు అప్పుడు సదా మీలోనే వుంటాడు, మీతోనే వుంటాడు. ప్రతి క్షణం ఆయన సన్నిధిలోనే గడుపుతారు" అన్నారు.

# ఎటు వైపు కూర్చుంటే మంచిది?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458




బి.ప్రసాదిని - నాందేడ్

ప్రశ్న: నేను డాక్టర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించి రెండు సంవత్సరాలు అయింది. ఇంతవరకు సరైన అభివృద్ధి లేదు. ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో పెద్ద గది తీసుకున్నాను. ఇలా పార్టిషన్ వుండవచ్చా? ఈ విషయంలో సరైన సలహా ఇవ్వగలరు. ఓ.పి.పార్టిషన్ పేషెంట్స్‌ని చూడడానికి నేను ఏ మూల కూర్చుని ఎటువైపు మొహం పెట్టాలి? నేను కూర్చున్న స్థలం నుండి పేషెంట్స్‌ని కుడి వైపు నుండి పరీక్షించాలా? ఎడమ వైపు నుండా?

జవాబు: మీరు పార్టిషన్ కట్టుకున్న పద్ధతి, దాన్ని ఉపయోగిస్తున్న పద్ధతి కూడా వాస్తు ప్రకారం సరైనది కాదు. ఒక చిన్న మార్పు మీ ప్రాక్టీసుని పెంపొందిస్తుంది. ఇప్పుడు డెలివరీస్ మొదలైన వాటికి ఉపయోగిస్తున్న తూర్పు వైపు పార్టిషన్‌లో నైరుతి మూల తూర్పు అభిముఖంగా లేదా ఉత్తరాభిముఖంగా మీరు కూర్చుని మీ కుడి చేతివైపు ఎదురుగా పేషెంట్స్‌ని కూర్చోబెట్టి పరీక్షించండి. అదే పార్టిషన్‌కి ఉత్తర ఈశాన్యంలో తలుపు తెరవండి. అదే ఓ.పి. అవుతుంది. ప్రస్తుతం ఓ.పి.గా ఉపయోగిస్తున్న గదిని డెలివరీస్‌కి మొదలైన వాటికి ఉపయోగించండి. అక్కడ ప్రస్తుతం వున్న తలుపును మూసివేయండి చాలు.

## వాస్తు దోషాలు తెలపండి..

పి.వాగ్దేవి - గుంతకల్

ప్రశ్న: మా ఇంటి ప్లాన్ చూసి అందులో వున్న దోషాలు, చేయాల్సిన మార్పులు సూచించగలరు.

జవాబు: మీరు పంపిన ప్లాన్ ప్రకారం మీ ఇంటికి ఈశాన్యం కట్ అయిపోయి వుంది. అది సవరించడానికి వీలు లేకుండా వుంది. ఆగ్నేయంలో తూర్పుగోడకు ఆనుకుని కట్టిన లెట్రిన్స్‌ని తూర్పు గోడకు తగలకుండా కొంత భాగం తీసివేయాల్సి ఉంటుంది. ఇంటిగోడకు లెట్రిన్స్‌కి మధ్య వున్న ఖాళీ స్థలం కంటే లెట్రిన్స్‌కి తూర్పు(ప్రహరీ మధ్య గోడకు) వుండే ఖాళీ స్థలం ఎక్కువగా వుండాలి. వంట గదిని ఆరో నెంబర్ గదిలోకి మార్చి ఆ గదిలోనే ఆగ్నేయ మూలన తూర్పు అభిముఖంగా వంట చేయాలి. పడక గదిని 4వ నంబర్ గదికి మార్చుకొని, ఆ గదిలో నైరుతి మూలలో దక్షిణ తల వుంచి నిద్రించడం మంచిది. 1వ గదిలోని వీధి తలుపు పశ్చిమ వాయవ్యంలో వున్నట్లు చూపించారు. దానిని ప్రధాన ద్వారంగా ఉపయోగించడం వల్ల చాలా మేలు కలుగుతుంది.

## డబ్బు నిల్వ ఉండాలంటే?

సి.పార్థసారథి - హైదరాబాద్

ప్రశ్న: మా పరిస్థితి ఏమీ బాగాలేదు. నేను, మా నాన్న, కష్టపడి పని చేస్తున్నాం. అయినా డబ్బు నిల్వ వుండటం లేదు. ఈరోజు వచ్చిన సొమ్ము రేపటికి నిలువ వుండటం లేదు. మా ఇంటి ప్లాను చూసి శాస్త్ర ప్రకారం చేయాల్సిన మార్పులు సూచించగలరు.

జవాబు: మీరు ఉత్తర ఈశాన్యంలో లెట్రిన్ కట్టారు. అది కూడదు. తూర్పున వాకిలి కాస్త విశాలంగానే వుంది కదా. ఆ లెట్రిన్‌ని తీసివేసి దక్షిణ గోడకి చేర్చి లెట్రిన్ కట్టుకోండి. దాని పైన ఉత్తరం వాలుగా కప్పు (సిమెంటు రేకులు) వేయండి. అక్కడ కట్టే లెట్రిన్‌కి తూర్పున వున్న కాంపౌండు గోడకి మధ్యన వీలయినంత ఎక్కువ స్థలం వదిలేయాల్సి ఉంటుంది. ఈ ఒక్క మార్పు చేయండి. మంచి ఫలితాలు త్వరలోనే కనిపిస్తాయి.

## మార్పులు చేయలేని పరిస్థితి..?

బి.వెంకటేశ్వర్లు - కనిగిరి

ప్రశ్న: మీరు ఇచ్చిన సలహా ప్రకారం మా ఇంటికి చేసుకున్న మార్పుల వల్ల చాలావరకు మనశ్శాంతి లభించింది. అందుకు మీకు ధన్యవాదాలు. మీ సలహాలు చదవక ముందు మేం నైరుతిలో సెప్టిక్ ట్యాంక్ కట్టి, దాని మీద మరుగుదొడ్డి కట్టాం. కానీ అలా నైరుతిలో సెప్టిక్ ట్యాంక్ వుండకూడదని మీరు రాయటం చదివాను. దాన్ని తీసి మరో దగ్గర సెప్టిక్ ట్యాంక్ కట్టేటంత ఆర్థిక స్థోమత ప్రస్తుతం లేదు. ఇప్పుడు ఏం చేయాలి?

పై కప్పు ఉత్తరం వైపుగానీ, తూర్పు వైపుగానీ వాలుగా వుండాలని సెలవిస్తున్నారు. కానీ మాది పెంకుటిల్లు. దానికి అటు ఇటు కూడా వాలు ఉంటుంది కదా! ఏం చేయాలి?

జవాబు: మీకు వీలయినప్పుడే సెప్టిక్ ట్యాంక్‌ని ఉత్తరానికిగానీ, తూర్పుకిగానీ మధ్య స్థలంలో మార్చుకోండి. పెంకుటిండ్లు సాధారణంగా రెండు వైపులకు వాలు వుండటం మామూలే. పైకప్పు సిమెంట్ లేదా జింక్ షీట్స్ లేదా బెంగళూరు పెంకులతో వేసినప్పుడు ఒక్కోసారి ఒక వైపుకు మాత్రమే వాలి వుంటుంది. అటువంటి సందర్భాల్లోనే తూర్పు లేదా ఉత్తరం వాలు వచ్చే వాలు వచ్చే పైకప్పు వేసుకోవాలి. రెండు వైపులా వాలు వచ్చేలా వేసుకోవడం వాస్తు విరుద్ధం కాదు.

## ఆర్థికంగా ఎదగాలంటే ఏం చేయాలి?

కె.కార్తికేయన్ - ఏదులాబాద్

ప్రశ్న: మాది ఉన్నతమైన కుటుంబం. నాకు భార్య, నలుగురు ఆడపిల్లలు. పెద్ద కూతురు పెళ్లి చేయగలిగాను మిగతా ముగ్గురు పెళ్లికెదిగారు. మా ఆర్థిక పరిస్థితి బాగాలేదు. మా ఇంట్లో వాస్త దోషాలు ఉన్నాయా?

జవాబు: మీరు ఇంటిని చాలా వరకు వాస్తుకు విరుద్ధంగా నిర్మించుకున్నారు. ✦





# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



సంఘంలో గౌరవం పొందుతారు. సమస్యలు తీరి ఊరట చెందుతారు. విందు-వినోదాల్లో, శుభకార్యాల్లో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. కొత్త చదువుల పట్ల ఆకర్షితులవుతారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

## వృషభం



ప్రయాణాలలో నూతన వ్యక్తులు పరిచయమవుతారు. రుణాలు తీర్చి ప్రశాంతత పొందుతారు. పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. వాహన సౌఖ్యం పొందుతారు. విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి.

## మిథునం



ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. శ్రమ తప్ప ఫలితం ఉండదు. జీవిత భాగస్వామి నుంచి ధన లాభం పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. కాంట్రాక్టులు దక్కుతాయి, రెన్యువల్ చేయించుకోగలుగుతారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది. సంతానం పట్ల శ్రద్ధ కనబరుస్తారు.

## కర్కాటం



స్థిరాస్తి వివాదాలు తీరుతాయి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. సోదరులతో ఏర్పడిన వివాదాలు తీరి ఊరట చెందుతారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు పొందుతారు. ఉన్నత విద్య పట్ల శ్రద్ధ చూపిస్తారు. బాగా చదువుకోవాలి అన్న మీ ఆలోచనలు కలిసి వస్తాయి.

## సింహం



ఆస్తి వివాదాలు తీర్చి లబ్ధి పొందుతారు. నూతన మిత్రులు పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. వస్తు, వస్త్ర లాభాలు పొందుతారు. అన్య భాషల నేర్చుకోవాలన్న ఆసక్తి కలుగుతుంది. ఇంటికి దూరంగా వెళ్లే అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు.

## కన్య



బంధువులతో ఏర్పడిన ఆస్తి తగాదాలు పరిష్కారమవుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి. ముఖ్యమైన పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. ఆకస్మిక ప్రయాణాలలో అపశృతులు ఏర్పడతాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయడం మంచిది.

## తుల



మిత్రుల నుంచి ముఖ్యమైన సమాచారం అందుతుంది. కుటుంబంలో శుభ కార్యాల ప్రస్తావన వస్తుంది. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. విందు, వినోదాల్లో, శుభ కార్యాల్లో పాల్గొంటారు. మీ మీద ఉన్న బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. విలువైన వస్తు లాభం పొందుతారు. విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి పెరుగుతుంది.

## వృశ్చికం



వృత్తి, వ్యాపారాలలో ఎదురైన చికాకులు తీరుతాయి. అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమించి అధిగమిస్తారు. ఆర్థిక ఇబ్బందులు కొంతవరకు తీరుతాయి. సోదరుల నుంచి ధన లాభం పొందుతారు. విద్యార్థులు పరీక్షలకు సంబంధించిన పత్రాల భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించండి. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఆ బొట్టు ధరించండి.

## ధనుస్సు



ప్రముఖులతో పరిచయాలు, స్నేహాలు ఏర్పడతాయి. విందు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. కాంట్రాక్టులు లాభిస్తాయి. సంతానాభివృద్ధి సంతోషం కలిగిస్తుంది. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం శుభప్రదం. విద్యార్థులు చదువు విషయంలో జాగ్రత్తగా ఉండండి.

## మకరం



రుణాల నుంచి విముక్తి పొందుతారు. సన్నిహితుల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయడం మంచిది. రాజకీయాల్లో వున్నవారికి అనుకూలమైన సమయం. చిన్ననాటి మిత్రులను కలుస్తారు.

## కుంభం




చేపట్టిన పనులలో ఎదురైన ఆటంకాలు కొంతవరకు తీరుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలం. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. వివాదాలకు దూరంగా వుండడం మంచిది. ప్రయాణాలు లాభిస్తాయి. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. బంధువులతో మాట పట్టింపులు వచ్చే సూచనలున్నాయి.


## మీనం




అనుకున్న కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. పట్టుదల పెరుగుతుంది. సోదరులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమై ఊరట పొందుతారు. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. కాంట్రాక్టులు లభిస్తాయి. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఆ బొట్టు ధరించండి. విద్యార్థులు పరీక్షల వత్తిడికి లోను కాకుండా సమయపాలన పాటించడం మంచిది.

# ఈ వారం 'కార్టూన్స్'


రేపు MRI, ఈలోపు రోడ్లపైన డీజే ఉంటే ఆ డీజే తోపాటు ఈయన్ని 2,3 గంటలు తిప్పండి...
శబ్దాలు అలవాటు అవుతాయి !!
MRI & CT
MRI
Zakir...


మా బావగారే! చుట్టపు చూపుగా వచ్చినా సరే.. 11 గంటలకు చెక్ అవుట్ చేయాల్సిందే.. హోటల్స్ లో ఉండీ ఉండీ అలా అలవాటయ్యింది!!
Zakir...


చిన్నప్పుడు మా అమ్మ పన్నెండు బొబ్బట్లు చేస్తే రెండు దేవుడికని తీసి బిచ్చగాళ్లకిచ్చేది.. అదే ఆదాయపు పన్ను లెక్కని ఇప్పుడర్థం అవుతోంది!!
Zakir...







శిలారణ్యంగా పిలవబడే ఈ అడవి చైనా దక్షిణ ప్రాంతంలోని యునాన్ ప్రావిన్స్ రాజధాని కున్‌మింగ్‌కు దగ్గరలో ఉంది. ఎటు చూసినా ఈ సున్నపు రాతి శిలలు కనిపిస్తాయి. దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది.







